

సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

జగన్ ప్రభుత్వం రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసేలా తీసుకున్న నిర్ణయాలను కూటమి ప్రభుత్వం సవరిస్తూ వస్తోంది. సీఆర్‌డీఏ పరిధిని గత ప్రభుత్వం కుదించగా తాజాగా దానిని పూర్వస్థితికి తెచ్చారు. ఏపీసీఆర్‌డీఏ(ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిం ది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించి దీనికి ఆమోదముద్ర వేసింది. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆరు మండలాలు, 92 గ్రామాలు, బాపట్ల జిల్లాలోని ఐదు మండలాల్లోని 62 గ్రామాలు తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి వచ్చాయి. దీంతో సీఆర్‌డీఏ విస్తీర్ణం తిరిగి 8352.69 చదరపు కిలోమీటర్లకు చేరింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం బిల్లు పెట్టి రాజముద్ర వేయనుంది. ఈ నిర్ణయంపై సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాలు, పట్టణాల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

- పరిధిని పునరుద్ధరించిన ప్రభుత్వం
- 8,352.69 చదరపు కిలోమీటర్లకు చేరిన విస్తీర్ణం
- గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ మంత్రివర్గం తీర్మానం
- మంత్రివర్గం నిర్ణయంపై పల్నాడు, బాపట్ల జిల్లావాసుల హర్షం

నరసరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు గత టీడీపీ ప్రభుత్వం కృషి చేయగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం దానిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నింది. ఇందులో భాగంగా సీఆర్‌డీఏను తొలుత రద్దు చేసేందుకు ప్రయత్నించి అది వీలు కాకపోవడంతో పరిధిని కుదించింది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా.. రాజధాని రైతులు పోరాడినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అమరావతిని పట్టాలెక్కిస్తోంది. ఇందులో భాగంగా సీఆర్‌డీఏ పరిధిని పునరుద్ధరిస్తూ బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో సీఆర్‌డీఏ పరిధిపై అస్పష్టత నెలకొనగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి నిర్ణయం తీసుకుంది. 2014లో ఏదైతే ఏపీసీఆర్‌డీఏ చట్టాన్ని ఆమోదించారో దానినే పునరుద్ధరించేందుకు ఆమోదముద్ర వేసింది. దీంతో గుంటూరు జిల్లాలో తాడేపల్లి మండలం, అర్బన్ ఏరియా, మంగళగిరి మండలం అర్బన్ ఏరియా, తుళ్లూరు, దుగ్గిరాల, తెనాలి మండలం, అర్బన్, గుంటూరు మండలం, అర్బన్, చేబ్రోలు, మేడికొండూరు, పెదకాకాని, వట్టిచెరుకూరు, అమరావతి, కొల్లిపర, వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాలు సీఆర్‌డీఏలోకి వచ్చాయి. వీటితో పాటుగా భట్టిప్రోలు మండలంలోని శివనాగులపాలెం, భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు, పొన్నూరు మండలంలో మునిపల్లె, మామిళ్లపల్లి, కొండముడి, ఉప్పరపాలెం, చింతలపూడి, వెల్లలూరు, ఆరేమండ, దండమూడి, పచ్చలతాడిపర్రు, మన్నవ, దొప్పలపూడి, జడవల్లి, నిడుబ్రోలు, జూపూడి, బ్రాహ్మణకోడూరు, వడ్డిముక్కల గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని కొండపాడు, యనమదల,

(మిగతా 6వ పేజీలో..)

దశ, దిశలేని బావుడా

కేవలం ఓ నామినేటెడ్ పోస్టు సృష్టించడం కోసమే ఆదరాబాదరాగా గత వైసీపీ ప్రభుత్వం బావుడా ఏర్పాటు చేసిందనే విమర్శలున్నాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు, కాకుమాను మండలాలను కూడా బావుడా పరిధిలోకి తెచ్చింది. చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ఒంగోలు కేంద్రంగా ఉన్న ఉడా పరిధిలో ఉన్నాయి. దీంతో జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో మూడు అటు, మూడు ఇటు ఉన్నాయి. ఇక సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న వేమూరు నియోజకవర్గాన్ని తీసుకొచ్చి బావుడాలో అయితే విలీనం చేసింది తప్ప అభివృద్ధి విషయంలో ఓ దశ, దిశ చూపడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తమ ప్రాంతం సీఆర్‌డీఏలోకి వెళ్లగా అభివృద్ధిపై గంపెడాశలతో ఉండగా వారి ఆశలను కాలరాస్తు వైసీపీ ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందనేది అక్కడి ప్రజల అభిప్రాయం.

తగ్గిన పూడా పరిధి

పల్నాడు జిల్లాలోని ఆరు మండలాలు, సత్తెనపల్లి మున్సిపాల్టీని సీఆర్‌డీఏలో విలీనం చేస్తూ క్యాబినెట్‌లో తీర్మానంతో పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అధార్టీ(పూడా) పరిధిని తగ్గింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాలతో పూడాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 22 మండలాలకు పూడా పరిధిని కుదించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, యడ్లపాడు మండలాలను పూడా నుంచి తొలగించి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకున్నారు. దీంతో పూడా రూపురేఖలు మారిపోయాయి. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలు, గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకే పూడాకు పరిమితమైంది.



సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

అమరావతికి నిరంతరాయంగా వెలుగులు

- అండర్ గ్రౌండ్ కేబుల్.. నాణ్యమైన విద్యుత్ సరఫరా
- తాళ్లాయపాలెంలో 20 ఎకరాల్లో రూ.505 కోట్లతో నిర్మాణం
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ.. ఐదు నెలల్లో పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం
- నేడు 400/220 కే.వీ.సబ్ స్టేషన్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తుళ్లూరు, గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నిరంతరాయంగా.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా 400/220 కేవీ సబ్ స్టేషన్ అందుబాటులోకి వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో 20 ఎకరాల్లో రూ.505 కోట్లతో స్విచ్చింగ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని ఐదేళ్లగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులను పట్టాలెక్కించే క్రమంలో ఈ సబ్‌స్టేషన్ పనులను తిరిగి చేట్టింది. ఐదు నెలల్లో పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ సబ్‌స్టేషన్‌తో రాజధాని అమరావతిలో నిర్మాణం జరిగే సచివాలయం హైకోర్టు, అసెంబ్లీ, రాజ్ భవన్, సీఎం క్యాంప్ కార్యాలయం, ప్రస్తుతం ఉన్న వెలగపూడి సచివాలయం, అసెంబ్లీ హైకోర్టు భవనాలకు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుంది. సబ్‌స్టేషన్ నుంచి రాజధాని ప్రాంతంలో ఎక్కడా స్తంభాలు లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. కొండపల్లి థర్మల్ పవర్ స్టేషన్ నుంచి తాళ్లాయపాలెం స్విచ్చింగ్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు నిరంతరం కరెంట్ సరఫరా అవుతుంది. దీంతో రాజధాని ప్రాంతంలో 24 గంటలు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

తాళ్లాయపాలెంలో సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మరో ఆరు సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలతో పాటు 15 సబ్ స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన, కొత్త విద్యుత్ లైన్లను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తాళ్లాయపాలెంలో అధికారులు భారీగా ఏర్పాట్లుచేశారు. ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి తదితరులు పరిశీలించారు. సబ్‌స్టేషన్ ప్రాంగణంలోనే ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు వేదికను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి రాజధాని ప్రాంతవాసులు భారీగా హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాష, గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దారు సుజాత, నాయకులు పుట్టి రామచంద్రరావు, ధనేకుల సుబ్బారావు, లంకా సుధాకరరావు, కొండెపాటి బుజ్జి, శ్రీహరి, సుబ్రహ్మ ణ్యం, వాకచర్ల వీరాంజనేయులు, బెజవాడ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



సీఎం ప్రారంభించే విద్యుత్ సబ్ స్టేషన్ పైలాన్

రూ. 4.71 కోట్లతో కాలువల మరమ్మతులు

- జలవనరుల శాఖ ఎస్సీ కృష్ణమోహన్

అర్చకులకు పెరిగిన 'గౌరవ'ం

- రూ. 15 వేలకు వేతనం పెంపు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 362 ఆలయాలకు వర్తింపు
- ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ అమలు

గంజాయి విక్రేతల అరెస్టు

6

3.30 లక్షలు దాటిన దరఖాస్తులు

- పట్టభద్రుల ఓటుకు ముగిసిన గడువు
- 20 లోపు పరిశీలన పూర్తి.. 23న జాబితాల విడుదల

గుంటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు గ్రాడుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటుహక్కు కోసం పట్టభద్రులు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. చివరి రోజున 80 వేలమందికి పైగా దరఖాస్తులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఈఆర్‌వోకు చేరాయి. దరఖాస్తుకు గడువు ముగింపు అయిన బుధవారం రాత్రి 8 గంటల సమయానికి 3.30లక్షల సంఖ్యలో దరఖాస్తులు అందినట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్‌ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. అత్యధికంగా గుంటూరు జిల్లా నుంచి లక్షమందికి పైగా పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. అన్ని దరఖాస్తులను రాబోయే రెండు వారాల్లో క్షుణ్ణంగా పరిశీలనచేసి అర్హత ఉన్న వారికి ఓటుహక్కు కల్పిస్తూ ముసాయిదా జాబితాలో చేరుస్తామన్నారు. ఆన్‌లైన్‌లో బాపట్ల జిల్లా నుంచి 23,707, ఏలూరు నుంచి 17,249, గుంటూరు నుంచి 1,07,088, కృష్ణాలో 59,500, ఎన్‌టీఆర్‌లో 66,690, పల్నాడులో 56,302 కలిపి మొత్తం 3లక్షల 30వేల 536 దరఖాస్తులు అందాయి. వీటిల్లో ఏఈఆర్‌వో వద్ద 3,19,075 పెండింగ్‌లో ఉండగా ఈఆర్‌వో ఆన్‌లైన్‌లో 8,050 పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు 3,385 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆమోదించారు. 26 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఆఫ్‌లైన్‌లో 13,230 దరఖాస్తులు రాగా 551 ఆమోదించారు. 12,679 పెండింగ్‌లో ఉన్నాయి. కాగా ఫారం-18 ఓటరుజాబితాలో పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం రాత్రితో గడువు ముగిసింది. ఆరు జిల్లాలకు సంబంధించి చివరి నిమిషంలో వచ్చిన దరఖాస్తులు క్రోడీకరించాల్సిఉంది. దీన్ని పరిగణలోకి తీసుకుంటే 3.50లక్షల సంఖ్య దాటే అవకాశం ఉన్నట్లు అంచనా దాదాపు 3.20లక్షల ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న దృష్ట్యా గురువారం నుంచి క్షేత్రపరిశీలనని ముమ్మరం చేయనున్నారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తుల పరిశీలనని పూర్తిచేసి ఆమోదించిన వాటి వివరాలను ఈఆర్‌వోకు ఏఈఆర్‌వోలు అందజేయాల్సి ఉంది. ఆ తర్వాత 23న ముసాయిదా ఓటర్లజాబితా ప్రచురిస్తారు. అనంతరం క్లెయిమ్‌లు, అభ్యంతరాలు చేపడతారు. అప్పుడు కూడా ఫారం-18కి అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య మరింతపెరిగే అవకాశం ఉన్నది.



ట్రాన్స్‌ఫార్మర్ పగలు గొట్టి రాగి తీగను అపహరించిన అగంతకులు



పగలగొట్టిన వాటి స్థానంలో ఏర్పాటు చేయనున్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు

రూ.2 వేల కోసం ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

- పొలాల్లోని 145 ట్రాన్స్‌ఫార్మర్లు పగలుగొట్టి రాగి అపహరణ
- విద్యుత్ లేక పొలాలకు నీరందక.. అన్నదాతల ఇక్కట్లు
- స్పందించిన మంత్రి గొట్టిపాటి.. 70 ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రూ.2వేల కోసం దొంగలు.. పంటలకు నీటి కోసం రైతులు ఆధారపడే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారు. జిల్లాలో ఏడు నెలల వ్యవధిలో 145 ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి పంటలకు నీరు అందక అన్నదాతలు అల్లాడుతున్నారు. ప్రభుత్వంపై రూ.2.15 కోట్ల భారం పడింది. ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీపై విద్యుత్ శాఖ అధికారులు.. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే ఈ ముఠాను అరికట్టడంతో పోలీసు శాఖ విఫలమైందన్న విమర్శలున్నాయి. జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు జరుగుతున్న తీరు విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి వెళ్లింది. చోరీలను నిరోధించడంలో పోలీసు శాఖ తీరుపై ఆయన ఇటీవల అసహనం వ్యక్తం చేశారు. పంటలకు బోర్ల ద్వారా నీటిని అందించేందుకు విద్యుత్ సరఫరా కోసం పొలాల్లో ట్రాన్స్‌కో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసింది. రాత్రి వేళలో అగంతకులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి వాటిని దొంగలించి ధ్వంసం చేసి దానిలోని రాగి తీగను మాత్రమే తీసుకువెళతారు. దీని ఖరీదు రూ.2 వేలు ఉంటుంది. కేవలం రూ2 వేల కోసం రూ.లక్షన్నర విలువైన ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేస్తున్నారు. దీని వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయి పొలాలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలకు సకాలంలో నీరందించలేక పంటలను కోల్పోవాల్సి వస్తోంది. రాగి తీగ కోసం ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తుండటంతో అటు రైతులు.. ఇటు ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 145 ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురైనట్లు విద్యుత్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. మాచర్ల విద్యుత్ శాఖ సబ్‌డివిజన్ పరిధిలో 110 ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగలించబడినట్లు అధికారులు గుర్తించారు. రైతులు కూడా బృందాలుగా ఏర్పడి ట్రాన్స్‌ఫార్మర్‌లను రక్షించుకోవాల్సి ఉంది.

స్పందించిన మంత్రి గొట్టిపాటి

పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో పంటలకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని ఇటీవల జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి అయిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి 70 ట్రాన్స్‌ఫార్మర్లను సరఫరా చేయించారు. మాచర్ల డివిజన్ పరిధిలో 40, నరసరావుపేట సబ్‌డివిజన్ పరిధిలో 30 ట్రాన్స్‌ఫార్మర్‌లను చోరీకి గురైన వాటి స్థానంలో విద్యుత్ శాఖ ఏర్పాటు చేయనున్నది. రెండు మూడు రోజుల్లో వీటి ఏర్పాటు పూర్తవుతుందని ఈఈ సీహెచ్ రాంబొట్లు తెలిపారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ల విషయంలో కనీస భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల సమస్యకు పరిష్కారం లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ రైతుబంధు

- రైతుల బజార్ల ఏర్పాటుకు చర్యలు
- ఆంధ్రజ్యోతితో మార్కెటింగ్ శాఖ ఏడీఎం సూర్యప్రకాష్‌రెడ్డి



నరసరావుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల అటకెక్కి న రైతుబంధు పథకా న్ని మార్కెంటింగ్ శాఖ పునరుద్ధరిస్తోంది. దీని వలన రైతులు పండించిన పంటను మార్కెట్ యార్డు గోదాములలో నిల్వ చేసుకొని రుణం పొందే అవకాశాన్ని కల్పించనున్నారు. ఈ పథకం మీద రైతులకు అవగాహన కల్పించడానికి సన్నాహా లు చేస్తున్నారు. రైతుల బజార్లు ఏర్పాటుకు కూడా మార్కెంటింగ్‌శాఖ చర్యలు చేపట్టింది. మార్కెంటింగ్ శాఖ రైతుల కోసం చేపడుతున్న పథకాలను బుధవారం మార్కెటింగ్ శాఖ ఏడీ ఎం సూర్యప్రకాష్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ప్రశ్న: రైతుబంధుపథకం అమలెలా ఉంది?

ఏడీఎం: రైతు బంధు పథకంను మార్కెట్ యార్డుల ద్వారా తిరిగి పురరుద్ధరించాం. కార్డులను కూడా సిద్ధం చేశాం. రైతులు పండించిన పంటలను మార్కెట్‌యార్డు గోదాములలో నిల్వ చేసుకోవడం ద్వారా రుణం పొందవచ్చు. గరిష్ఠంగా రూ.2లక్షల వరకు రైతులు వారు నిల్వ చేసిన పంటనిల్వలకు రుణం ఇవ్వడం జరుగుతుంది. ఈ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: రైతుబజారులు ఎన్ని నిర్వహిస్తున్నారు?

ఏడీఎం: జిల్లాలో ఒక్క చిలకలూరిపేట పట్టణంలో మాత్రమే రైతుల బజారు నిర్వహిస్తున్నాం. ఇతర పట్టణాల్లో రైతు బజార్లు లేవు. నరసరావుపేట, వినుకొండ పట్టణాల్లో రైతుల బజార్లు ఏర్పాటుకు స్థలసేకరణ చేయాల్సి ఉంది. వినుకొండలో జలవనరులశాఖకు సంబంధించిన స్థలంలో రైతుల బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. స్థలం ఇంకా మార్కెటింగ్‌శాఖకు అప్పగించలేదు. నరసరావుపేటలో రైతుల బజారు ఏర్పాటు స్థల పరిశీలన దశలో ఉంది. ఈ రెండు పట్టణాల్లో రైతుల బజార్లు ఏర్పాటుకు అవకాశం ఉంది.

ప్రశ్న: పత్తి కొనుగోళ్లు ప్రారంభించారా ?

ఏడీఎం: పత్తి కొనుగోళ్లను సీసీఐ చేపట్టింది. జిల్లాలో తొలి విడతలో ఏడుచోట్ల పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. మరో మూడు కేంద్రాలు త్వరలోనే సీసీఐ ఏర్పాటుచేస్తుంది. డిమాండ్ ఆధారంగా కేంద్రాల సంఖ్య పెంచుతాం. గత ఏడాది 6 కేంద్రాల ద్వారానే కొనుగోళ్లు జరిగాయి.

ప్రశ్న: మార్కెట్ సెస్ వసూళ్లు ఎలా ఉన్నాయి ?

ఏడీఎం: మార్కెట్ సెస్ వసూలు లక్ష్యం రూ.30కోట్లు. ఇప్పటివరకు 30శాతం వసూలు చేశాం. గత రబీలో వరిసాగు లేని కారణంగా సెస్ వసూలు తగ్గింది. నిర్దేశించిన లక్ష్యంలో మార్చి 31లోపు 90శాతం వరకు సెస్ వసూలయ్యే అవకాశం ఉంది. నూరు శాతం లక్ష్యాలను చేరుకొనే దిశగా వసూళ్లు చేపడుతున్నాం.

ప్రశ్న: గ్రామాల్లో లింకురోడ్లు నిర్మాణం చేపడుతున్నారా?

ఏడీఎం: లింకురోడ్ల నిర్మాణం అంశం మార్కెట్ కమిటీల పరిధిలో ఉంది. కమిటీలు తీర్మానం మేరకు పనులు చేపట్టడం జరుగుతుంది.

ప్రశ్న: పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారా?

ఏడీఎం: పశువైద్య శిబిరాలు కూడా మార్కెట్‌యార్డుల ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంది. గతంలో పశువైద్య శిబిరాల నిర్వహణ జరగలేదు. తిరిగి వైద్యశిబిరాలు నిర్వహించే దిశగా మార్కెట్‌యార్డులు చర్యలు తీసుకుంటున్నాయి. యార్డుల ద్వారా వైద్యశిబిరాల్లో ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ఏడాది ఇప్పటి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన ప్రభుత్వం వచ్చే ఏడాది ప్రతి మండలంలో కనీసం ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా ఆయా కళాశాలల్లో మెరుగైన శిక్షణ ఇవ్వడంతోపాటు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల ఇంటర్ బోర్డు అధికారులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమీక్షలో నూతన విద్యావిధానాలపై విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించారు.

- వచ్చే ఏడాది నుంచి మండలానికో జూనియర్ కళాశాల
- భారీ అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక
- ఇంటర్ కళాశాలల్లో ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షలకు శిక్షణ
- ఈ ఏడాది ఇప్పటికే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ



గుంటూరు(విద్య)నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ఇప్పటికే 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రస్తుతం 15వేలమందికిపైగా విద్యార్థిని విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. అంటే ఇంకా దాదాపు సగం మండలాల్లో ప్రభుత్వ లేదా ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు లేవు. ఈనేపథ్యంలో జూనియర్ కళాశాలలు లేని మండలాల్లో కొత్తగా కళాశాలలు ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. ఇందుకు ప్రైవేటువిద్యాసంస్థల్ని ప్రోత్సహించి త్వరితగతిన అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు జాతీయస్థాయిలో పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రస్థాయిలో జరిగే ఎంసెట్‌తోపాటు, జాతీయ స్థాయిలో జరిగే నీట్, జేఈఈ మెయిన్స్‌అడ్వాన్స్‌పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అంతేకాకుండా

(మిగతా 8వ పేజీలో..)

రూ. 4.71 కోట్లతో కాలువల మరమ్మతులు

● జలవనరుల శాఖ ఎస్సీ కృష్ణమోహన్


సమావేశంలో ఎస్సీ కృష్ణ మోహన్, ఈఈలు

నరసరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాచర్ల జలవనరుల శాఖ సబ్ డివిజన్ పరిధిలో కాలువల మరమ్మతులకు రూ. 4.71 కోట్లు విడుదల అయ్యాయనీ, 101 పనులు చేపడుతున్నామని జలవనరుల శాఖ ఎస్సీ కృష్ణ మోహన్ తెలిపారు. నరసరావుపేటలోని సర్కిల్ కార్యాలయంలో మరమ్మతు పనులపై బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదరు పనుల నిర్వహణకు త్వరితగతిన టెండర్లు నిర్వహించాలని ఈఈలను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసి పనుల అగ్రిమెంట్లు స్వీకరించి వెంటనే పనులు చేపట్టాలని సూచించారు. పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. నీటి పారుదలకు అడ్డుగా ఉన్న కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగించాలన్నారు. సమావేశంలో ఈఈ శ్రీహరి, డీఈఈలు మురళీధర్, వెంకట సుబ్బయ్య, ఏఈలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి


బాలింతలకు పోషకాహార కిట్‌లను పంపిణీ చేస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

బాపట్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం బాపట్ల మండలం వెదుళ్లపల్లి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాని, నందిరాజుతోట హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. గతేడాది కన్న ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులకు పెట్టే ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని రికార్డుల్లో సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు సంతకాలు పెట్టాలని సూచించారు. మూడేళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో ఉండేవిధంగా అధికారులు కృషి చేయాలని చెప్పారు. అనంతరం సెంటర్‌లోని కోడిగుడ్లు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహార ప్యాకెట్లను పరిశీలించారు. బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, వివిధశాఖాధికారులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ ఆధారంగా జీతాల్లో కోత అన్యాయం

గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ ఆధారంగా జీతాల్లో కోత విధించటం అన్యాయం అని ఏపీ హంస అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణ బాబుని కలిసిన హంస అసోసియేషన్ నేతలు వినతి పత్రం సమర్పించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు ఆధారంగా కోత విధించిన జీతాలు తిరిగి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కొత్తగా రెగ్యులర్ అయిన ఉద్యోగుల ప్రొబేషన్ ఒక సంవత్సరానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. హంస అసోసియేషన్ నేతల విజ్ఞప్తిపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణ బాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఏపీ హంస అసోసియేషన్ స్టేట్ అధ్యక్షుడు ఆరవ పాల్, సెక్రటరీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బి.కిరణ్, జిల్లా అధ్యక్షుడు బి.నాగ వర్ధన్, మహమ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

అర్చకులకు పెరిగిన 'గౌరవ'ం

● రూ. 15 వేలకు వేతనం పెంపు
● ఉమ్మడి గుంటూరు జిల్లాలో 362 ఆలయాలకు వర్తింపు
● ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ అమలు


గుంటూరు దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. ఆదాయం లేని చిన్న ఆలయాలకు పెద్ద ఊరట కల్పిస్తుంది. చిన్న ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు గౌరవ వేతనాన్ని పెంచింది. గతంలో ఇస్తున్న దాని కంటే మూడింతలు పెంచి, వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 362 దేవాలయాలను ఎంపిక చేసి, అందులో పని చేస్తున్న అర్చకులకు నెలకు రూ.15 వేలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అర్చకులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బ్రాహ్మణ సంక్షేమానికి సహాయ, సహకారాలు అందిస్తూ, వారికి ఆర్థికంగా చేయూతనిస్తున్నారు.

రూ. 50 వేల ఆదాయం పైబడిన దేవాలయాలకు..

దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని చిన్న ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు మూడింతలు జీతం పెంచారు. వాస్తవానికి ఈ ఆలయాలకు అతి తక్కువ ఆదాయం ఉంటుంది. ఏడాదికి ఆలయ ఆదాయం రూ. 50 వేల నుంచి రెండు లక్షల లోపు ఉంటుంది. ఇలాంటి ఆలయాలకు గతంలో సరైన ఆదరణ లేదు. ధూప దీప నైవేద్యం కూడా లేని పరిస్థితులు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గతంలో కొన్ని ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఆలయాల్లో దేదీప్యమానంగా సంవత్సరాంతం చక్కగా పూజలు జరుగుతున్నాయి. దీంతోపాటు అదనంగా మరికొన్ని ఆలయాలకు చేయూతనిస్తూ, అందులో పని చేస్తున్న అర్చకులకు భారీగా జీతాలు పెంచారు. గతంలో నెలకు రూ.6వేలు తీసుకునే అర్చకుడు ఇప్పుడు రూ.15 వేలు తీసుకోనున్నారు.

మూడు జిల్లాల్లో 362 ఆలయాలకు వర్తింపు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మొత్తం 362 చిన్న ఆలయాలకు వర్తింప చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో 107, బాపట్ల జిల్లాలో 128, పల్నాడు జిల్లాలో 127 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు నెలకి రూ. 15 వేలు గౌరవ వేతనంగా చెల్లించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1683 ఆలయాలను ఎంపిక చేశారు.

జీవో జారీ..

ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎన్డీఏ నేతలు హామీ ఇచ్చారు. అ హామీలో భాగంగానే అర్చకుల సంక్షేమానికి చేయూతను అందిస్తున్నారు. ఇప్పటికే ఆదాయం లేని ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకం కింద నెలకు రూ.10 వేలు చొప్పున అందిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం తక్కువగా ఉన్న చిన్న ఆలయాలను 6 (సీ-2) గుర్తించి, అందులో పని చేస్తున్న అర్చకులకు నెలకు రూ. 15 వేలు చెల్లించే విధంగా జీవో ఎంఎస్ నంబర్ 261ని బుధవారం జారీ చేసింది. దీంతో ఆ ఆలయాల్లో పనిచేస్తున్న బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



రాష్ట్రంలో చిన్న దేవాలయాలకు ఆదాయం లేదు. దీనిని గుర్తించిన ప్రభుత్వం చేయూత ఇచ్చేందుకు కృషి చేయటం అభినందనీయం. ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. చిన్న ఆలయాల్లో పని చేస్తున్న పేద బ్రాహ్మణులను ప్రభుత్వం ఈ విధంగా ఆదుకోవడం సంతోషకరం.

- దేవదాయ శాఖ డీసీ కేబీ శ్రీనివాసరావు

సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

(5వపేజీ తరువాయి)

ఈదులపాలెం, నడింపాలెం, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, గొట్టిపాడు, కొండ జాగర్లమూడి, గనికెపూడి, పెదనందిపాడులో గొరిజవోలు గుంట పాలెం, యడ్లపాడు మండలంలోని మర్రిపాలెం, ఉన్నవ, కొండవీడు, సొలస, వంకాయలపాడు, మైదవోలు, యడ్లపాడు, విశ్వనాథుని కండ్రిక, జాలాది, తిమ్మాపురం, కారుచోల, నాదెండ్ల మండలంలోని నాదెండ్ల, ఫిరంగిపురం మండలంలోని హవును గణేష, రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్, నుదురుపాడు, వేమవరం, బేతపూడి, తాళ్లూరు, యర్రగుంట్లపాడు, సిరంగిపాలెం, తక్కెళ్లపాడు, ముప్పాళ్ల మండలంలోని మాదల, సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు, నందిగామ, కంటెపూడి, భీమవరం, కంకణాలపల్లె, గుడిపూడి, ఫణిదం, అబ్బూరు, పాకాలపాడు, రెంటపాళ్ల, గోరంట్ల, కట్టమూరు, భట్లూరు, వడ్డవల్లి, పెదకూరపాడు మండలంలోని అన్ని గ్రామాలు, అచ్చంపేట మండలంలోని కస్తల అగ్రహారం, కోనూరు, ఓర్వకల్లు, అంబడిపూడి, వేల్పూరు, చిగురుపాడు, మిట్టపాలెం, పెదపాలెం, చామర్రు, అచ్చంపేట, నీలేశ్వరపాలెం, తాళ్లచెరువు, చింతపల్లి, కోగంటివారిపాలెం, క్రోసూరు మండలంలోని అనంతవరం అగ్రహారం, క్రోసూరు, విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం, పారుపల్లి, పీసపాడు, అందుకూరు, బాలెమర్రు, ఉయ్యందన గ్రామాలు ఏపీసీఆర్‌డీఏలోకి వచ్చాయి.

సీఆర్‌డీఏ ప్రస్థానం..

2014లో ఏపీసీఆర్‌డీఏ ఏర్పడింది. గుంటూరు, ఏలూరు, ఎన్‌టీఆర్, కృష్ణ, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామాలు, పట్టణాలతో దీని కూర్పు జరిగింది. అంతకుముందు ఉన్న వీజీటీఎం ఉడాని రద్దు చేసి పరిధిని పెంచి సీఆర్‌డీఏని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో జోన్లను కూడా ఏర్పరిచింది. అవుటర్ రింగురోడ్డుని కూడా ఎలైన్‌మెంట్ చేసి నిర్మాణం చేపట్టే సమయంలో ఎన్నికలు జరిగి 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే జీఎస్ రావు కమిటీ అని ఏర్పాటు చేసి మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అందుకు అనుగుణంగా 2020లో ఏపీసీఆర్‌డీఏ బిల్లుని రద్దు చేసింది. దీనిపై అమరావతి రాజధాని పరిరక్షణ సమితి రైతులు ఉద్యమించారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో కేసులు వేసి పోరాడారు. ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు స్టే విధించింది. అంతేకాకుండా ఏపీసీఆర్‌డీఏ చట్టం రద్దు చెల్లదని తీర్పు ఇచ్చింది. దాంతో వైసీపీ ప్రభుత్వం 2021లో సీఆర్‌డీఏ చట్టాన్ని పునరుద్ధరించింది. అయితే అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టకపోగా మరోవైపు సుప్రీం కోర్టులో రివిజన్ పిటీషన్ దాఖలు చేసింది.

ఆ మండలాలకు మహర్దశే

కూటమి ప్రభుత్వంలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతుండడంతో పాటు కేంద్రం నుంచి నిధులు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీంతో రాజధాని ప్రాంతంలో వివిధ పనులు చకాచకా జరుగుతున్న సంగతి తెలిసిందే. సీఆర్‌డీఏ పరిధిలో పలు ప్రాజెక్టులు భవిష్యత్తులో క్యూ కట్టనున్నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పలు గ్రామాలు సీఆర్‌డీఏలోకి వెళ్లాయి. దీంతో ఆయా గ్రామాల్లో కూడా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అక్కడి ప్రజలు భావిస్తూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది

వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలను తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనందాన్ని ఇచ్చింది. గత ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం కక్షసాధింపే అజెండాగా తీసుకున్న తలాతోక లేని నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఆ చీకటి నిర్ణయాలను సరిదిద్దే దిశగానే తిరిగి సీఆర్‌డీఏ పరిధిని కూటమి ప్రభుత్వం విస్తరించింది.

-నక్కా ఆనంద్‌బాబు, వేమూరు ఎమ్మెల్యే

కొలనుకొండ బైపాస్‌లో మహిళలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● తీవ్ర గాయాలు
● మంత్రి సవిత మానవత్వం


ఎన్నారై వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళ వద్ద మంత్రి సవిత

తాడేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి హైవేపై కొలనుకొండ వద్ద బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న నలుగురు మహిళలను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న మంత్రి ఎస్ సవిత తన మానవత్వాన్ని చాటుకుని గాయపడిన వారిని తన వాహనంలో స్వయంగా దగ్గరుండి ఎన్నారై వైద్యశాలకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి...... తాడేపల్లి సమీపంలోని కొలనుకొండ ప్రాంతంలో కూలిపనులకు వచ్చిన నలుగురు మహిళలు హైవే దాటుతుండగా విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొంది. దీంతో వారంతా తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అదే సమయంలో అటుగా వెళుతున్న మంత్రి సవిత స్పందించి క్షతగాత్రులను తన వాహనంలో ఎన్నారై వైద్యశాలకు తరలించి ఆమె కూడా మరో వాహనంలో వారి వెనుకనే ఎన్నారై వైద్యశాలకు వెళ్లి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఓ మహిళ పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు తెలిపారు. తక్షణమే స్పందించి క్షతగాత్రులను తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించిన మంత్రి సవితపై వాహనచోదకులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు. గాయపడిన వారు ఆదిలక్ష్మి, నారాయణమ్మ, సరస్వతి, నారాయణమ్మగా స్థానికంగా ఉండే జయభేరి సిబ్బంది తెలిపారు. గాయపడిన వారు వివరాలు వెల్లడించే పరిస్థితిలో లేరు. వీరిని విజయవాడకు చెందిన వారిగా భావిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అటుపిమ్మట ఎన్నార్ వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ రోడ్డు ప్రమాదంతో తాడేపల్లి హైవేపై దాదాపు కిలో మీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

పవన్ ఆలోచనా విధానం.. రాష్ట్రాభివృద్ధికే


మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ ఆలోచనా విధానాన్ని అందుకునేందుకు వైసీపీ నాయకులు సరిపోరని, తమ అధినేత దృష్టి అంతా రాష్ట్రాభివృద్ధి, ప్రజా శ్రేయస్సుపైనే ఉందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో పోలీసులు, హోం మంత్రి మరింత బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం పవన్ సూచిస్తే, దీనిపై వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పవన్ సూచనలను డీజీపీ, హోం మంత్రి స్వీకరించారని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. పల్నాడు జిల్లాలో సరస్వతి పవర్ భూములను పవన్ సందర్శించకూడదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేయడం హాస్యాస్పదమన్నారు. గురజాల శాసన సభ్యుడుగా పని చేసిన కాసు మహేశ్‌రెడ్డికి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఎక్కడుందనీ, ఆయనకు సిగ్గు, ఎగ్గూ ఉన్నాయా అని గాదె ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లు ఈ ప్రాంతాన్ని దోచుకుతిన్నారని, అక్కడ రోడ్లపై గుంతలు తప్పా అభివృద్ధి అనేది కనపడదని ఎద్దేవా చేశారు. క్వారీపాడులో సర్వే చేయకుండా 144 ఎకరాల భూమిని ఆక్రమించింది ఎవరో పల్నాడు ప్రజలకు తెలుసని ఆయన విమర్శించారు. పవన్ కల్యాణ్‌పై మంద కృష్ణమాదిగ వ్యాఖ్యలు సరికాదని, పవన్ కుల, మతాలకు అతీతంగా ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడుతున్న నాయకుడని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని గాదె అన్నారు. సమావేశంలో జనసేన కృష్ణా, పెన్నా రీజియన్ మహిళా కోఆర్డినేటర్ పాకనాటి రమాదేవి, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నేతలు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, శిఖా బాలు, చట్టాల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో ఎడ్యుకేషన్‌పై అధ్యయనం

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగపు విద్యార్థులు ఎస్.కె.సమీర్, త్రిపురనేని వసంత బాబులను ఉపకులపతి ఆచార్య కె.గంగాధర రావు, రెక్టర్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహచలం బుధవారం అభినందించారు. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ ఆహ్వానం మేరకు వారం రోజులు సకురా సైన్స్ ప్రోగ్రాంలో భాగంగా వర్సిటీ విద్యార్థులు జపాన్‌లో పర్యటించారు. వారం రోజుల పర్యటనలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వీసీ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం 2014లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జపాన్ లోని టయోమో రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా స్టూడెంట్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంకు ఇద్దరు విద్యార్థులు జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ వారి ఆహ్వానం మేరకు ఆ రాష్ట్రంలో పర్యటించారన్నారు. టయోమో రాష్ట్రంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలను సందర్శించి అక్కడ ఎడ్యుకేషన్, రీసెర్చ్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనం చేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, సహాయ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, డాక్టర్ చంద్రమౌళి, కోఆర్డినేటర్స్ డాక్టర్ చింక తిరుమలరావు, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వి.బాలాజీ, డాక్టర్ సతీష్, డ్రోన్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

తొలిరోజు ఆంధ్ర జట్టుదే పైచేయి

● యువన్, లోహిత్ సెంచరీలు


ఎం.యువన్


లోహిత్

మంగళగిరి సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీ ప్రారంభమైంది. ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య నాలుగు రోజులపాటు జరగనున్న మ్యాచ్‌లో తొలిరోజు ఆంధ్ర జట్టు పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. ఆంధ్ర బ్యాటర్లు ఎం.యువన్ 117 బంతుల్లో 9 సిక్సర్లు, 5 ఫోర్లతో 122 పరుగులు, లోహిత్ లక్ష్మీనారాయణ 166 బంతుల్లో 6 సిక్సర్లు, 12 ఫోర్లతో 113 పరుగులు సాధించారు. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్ 32 ఓవర్లలో 114 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. కూచ్ బెహర్ ట్రోఫీలో ఆంధ్ర జట్టు గ్రూప్-డిలో ఆడుతుంది. ఆంధ్ర జట్టు ఆడనున్న ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌లు మంగళగిరి ఏసీఏ మైదానంలో జరగనున్నాయి.

గంజాయి విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ పట్టణ ఎస్ఐ ఎం.పవన్ కుమార్‌కు గంజాయి అమ్మకంపై సమాచారం రావటంతో పట్టణంలోని రంగా కాలనీలో తన్నీరు అడివయ్య ఇంటి వద్దకు వెళ్లేసరికి ఇద్దరు వ్యక్తులు ఒక ప్లాస్టిక్ కవరు మధ్యలో పెట్టుకొని కూర్చొని ఉన్నారన్నారు. పోలీసులను చూసి ప్లాస్టిక్ కవరును అక్కడే వదిలి పారి పోయేందుకు ప్రయత్నించగా ఎస్ఐ పవన్ కుమార్ సిబ్బంది సాయంతో వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారిలో రంగా కాలనీకి చెందిన తన్నీరు అడివయ్య, విశాఖపట్నం జిల్లా భూపాలపట్నం గ్రామానికి చెందిన గూడె అప్పన్న ఉన్నారని తెలిపారు. అప్పన్న ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి సత్తెనపల్లిలో అడివయ్యకు విక్రయించగా ఆయన అమ్ముతున్నాడన్నారు. గతంలో రెండు సార్లు అడివయ్యను గంజాయి కేసులో అరెస్టు చేసినట్టు తెలిపారు. తహసీల్దార్ కె. శ్రీనివాస చక్రవర్తి సమక్షంలో ప్లాస్టిక్ కవరును తనిఖీ చేయగా గంజాయి ఆకులు, విత్తనాలు ఉన్నాయన్నారు. రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని కోర్టుకు హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రామకృష్ణ (ఫైల్ ఫొటో)

ముప్పాళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఇరుకుపాలెంలో మంగళవారం జరిగింది. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇరుకుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి భర్త రామకృష్ణ గత పదిహేను సంవత్సరాలుగా తనకు ఉన్న ఐదు ఎకరాలతో పాటు మరికొంత పొలం కౌలుకు తీసుకుని వరి, పత్తి, మిరప పంటలను సాగు చేశాడు. వ్యవసాయంతోపాటు ఎద్దులను కూడా పెంచేవాడు. వ్యవసాయంలో నష్టం రావటంతో తనకు ఉన్న ఐదు ఎకరాలను అమ్మి అప్పులు తీర్చాడు. అయినా అప్పులు తీరక పోవటంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రామకృష్ణ మృతదేహానికి గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ నియోజకవర్గ నాయకులు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు నివాళులర్పించారు. మృతునికి భార్య విజయలక్ష్మితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు జరిమానా

గుంటూరు(లీగల్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జైలు శిక్ష, నలుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ గుంటూరు 5వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కె.లత బుధవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ పర్యవేక్షణలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ. అశోక్ కుమార్ తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ రైడ్ నిర్వహించి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడుగురిని ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు 5వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చారు. ఈ కేసులను విచారించిన న్యాయమూర్తి ముగ్గురికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో నలుగురికి ఒకొక్కరికి పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 586.30 అడుగులు ఉంది. ఇది 301.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4679 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,979 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 12,827 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 9,595 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

50,326 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 54,072 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,326 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,952 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	9000	15000
నెంబరు. 5	9500	13500	నెంబరు. 5	10000	12000
273	10300	12300	273	13500	13500
341	8500	15000	341	8200	16300
4884	9000	13500	4884	11000	12500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17200	తేజ	8500	17200
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	10800

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ శ్రీనివాసరావు

గురజాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని బుధవారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ శివారులోని హైవే మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పాత్రికేయులు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎస్పీ వెంటనే మున్సిపల్ కమిషనర్, హైవే సంబంధిత అధికారులకు నోటీసులు పంపాలని డీఎస్పీ జగదీష్‌ను ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ జగదీష్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తెనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని కొత్తపేట, సుందరయ్య కాలనీల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

రైల్వే గేటు మూసి వేత



అచ్చంపేట రోడ్డులో మూసి వేసిన రైల్వే గేటు

సత్తెనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో గల రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా బుధవారం నుంచి మూసి వేశారు. గురువారం సాయంత్రం వరకు మరమ్మతు పనులు జరుగుతాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గం గుండా క్రోసూరు, అచ్చంపేట, మండలాల వైపు వెళ్ళే వాహనాలను దారి మళ్లించారు. గురువారం వరకు ఆర్టీసీ బస్సులు వేరే మార్గం గుండా వెళ్తాయని డిపో మేనేజర్ విజయ కుమార్ విలేకరులకు తెలిపారు. అచ్చంపేట, మాదిపాడు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు రైల్వే గేటు వద్ద నుంచి వెళ్తాయని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

12న బల్లకట్టు వేలం

● ఎంపీడీవో శ్రీనివాసరావు

మాచవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా ప్రజాపరిషత్‌లో ఈనెల 12వ తేదీన గోవిందాపురం బల్లకట్టు వేలం పాట నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీలు టెండర్లు స్వీకరిస్తారని, మధ్యాహ్నం 2 గంటల తరువాత సీలు టెండరు, బహిరంగ వేలం పాట నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు. వివరాలకు జడ్పీ కార్యాలయం, గుంటూరు వారిని సంప్రదించాలన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీ

సత్తెనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో మెడికల్ షాపులను గుంటూరు, నరసరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, సునీతతో పాటు గుంటూరు విజిలెన్స్ స్పెషల్ ఇన్‌స్పెక్టర్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన మందులు, బ్యాన్ చేసిన మందులు ఎవరైనా విక్రయిస్తున్నారా అని తనిఖీలు చేశారు. కొన్ని రకాల మందులను ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు.

న్యాయవాది మృతి

సత్తెనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పోతల రవికుమార్(48) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన 17 సంవత్సరాల నుంచి స్థానిక కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పలువురు న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, బార్ అసోసియేషన్ సభ్యులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భవిత సమాఖ్య అధ్యక్షురాలిగా భూలక్ష్మి

అచ్చంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండల భవిత సమాఖ్య అధ్యక్షురాలిగా వేల్పూరుకు చెందిన పొన్నెకంటి భూలక్ష్మి ఎన్నికయ్యారు. స్థానిక వెలుగు కార్యాలయంలో భవిత మండల సమాఖ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీఎం ఎస్‌కే సలీం అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోనూరుకు చెందిన కోట నాగేంద్రమ్మ కార్యదర్శిగాను, ట్రెజరర్‌గా కొండూరుకు చెందిన కొండ్రాజు రంగమ్మ ఎన్నికయ్యారు. తెలుగుయువత నాయకులు పొన్నెకంటి రవిచంద్, వేల్పూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు నల్లపాటి చందు, జువ్వా రామారావు నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

నేడు ఎన్‌జీ రంగా జయంతి

సత్తెనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఉదయం ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి జరుగుతుందని టీడీపీ పట్టణ కార్యదర్శి నూర్ బాషా జానీబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పశుగణన వారోత్సవాలు ప్రారంభం

కారంపూడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో బుధవారం ఇన్‌చార్జి పశువైద్యాధికారి దిలీప్ ఆధ్వర్యాన 21వ జాతీయ పశుగణన వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి వరకు పశువుల సర్వేను నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులు, ప్రజలు తమ పశువుల వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు.

డీఎస్పీ జగదీష్‌ను కలిసిన యాగంటి

మాచర్లటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గురజాల సబ్ డివిజన్ డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జగదీష్‌ను బుధవారం టీడీపీ సీనియర్ నేత, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు కలిశారు. గురజాల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

శిథిలావస్థలో పక్కా భవనాలు

● అద్దె గదుల్లో విద్యార్థులు
● పెరిగిన ముళ్లచెట్లతో బూత్‌బంగ్లాగా బీసీ హాస్టల్



శిథిలావస్థలో ఉన్న దాచేపల్లిలోని బీసీ హాస్టల్ భవనం



హాస్టల్ భవనం వద్ద పెరిగిన ముళ్లకంప చెట్లు

దాచేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడిన వసతి గృహాల ఆలనా పాలనా లేకపోవడంతో ముళ్లచెట్లు పెరిగి బూత్‌బంగ్లాగా మారాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో స్లాబుల పెచ్చులూడి గోడలకు వేసిన రంగులు వెలిసిపోయి తరగతి గదుల కు ఉన్న తలుపులు ఊడిపోయాయి. ఇదంతా కూడా దాచేపల్లి నగర పంచాయతీలోని వెనుకబడిన తరగ తుల వసతి గృహం దుస్థితి. దాచేపల్లి మండలంలో బడుగు బలహీనవర్గాల ప్రజలు అధికంగా ఉంటున్నా రు. వీరికి సరైన తిండి, వసతి లేకపోవడంతో చదు వులు మధ్యలోనే ఆపేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉం చుకొని అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యేగా ఉన్న యరపతి నేని శ్రీనివాసరావు ప్రభుత్వంతో మాట్లాడి లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి పక్కా భవనం నిర్మించారు. పది విశ్రాంతి గదులు, వంట గది, బాత్‌రూమ్‌లు, అంతరాయం లేకుండా ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలో 2000 సంవత్సరం నుంచి 2020 వరకు వంద నుంచి 150 మంది విద్యార్థులు భోజనం చేస్తూ హాస్టల్ గదుల్లోనే నివాసముంటూ దాచేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసేవారు. కరోనా తరువాత ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు రావడం కూడా తగ్గింది. దీనికి తోడుగా పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడం, పాఠశాలలో ఉపయోగించే నీరు బయటకు వెళ్లే మార్గంలేక హాస్టల్ ఆవరణలోనే నిల్వవుండి దుర్వాసన రావడం, వర్షం కురిస్తే భవనంపై శ్లాబు నుంచి నీరు కారుతోంది. దీనికి తోడు ప్రభుత్వం కూడా సకాలంలో హాస్టల్ నిర్వహణపై నిధులు మంజూరు చేయకపోవడంతో సమస్య మరింత ఉధృతంగా మారింది.

అద్దె గదుల్లో విద్యార్థులు

దాచేపల్లి నగర పంచాయతీలో డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. ఈ విద్యార్థులంతా వేరే ప్రైవేటు గదుల్లో ఉంటూ భోజన వసతి చేసుకొని కళాశాలకు వెళ్తున్నారు. ఉన్న భవనాలను పాడుచేసి అద్దె భవనాల్లో విద్యార్థులు ఉండాల్సి రావడం బీసీ వర్గాల ప్రజలకు బాధాకరంగా మారింది. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేస్తుంటే వైసీపీ ప్రభుత్వం బలహీన వర్గాల అభ్యున్నతిని ఏమాత్రం పట్టించుకోలేదు.

బీసీ హాస్టల్ కోసం పోరాటం చేశాం

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బాలయ్య



అప్పట్లో బీసీ హాస్టల్ ఏర్పాటు కావాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, దివంగత మంత్రి కోడెల శివప్రసాదరావుతో పోరాడి హాస్టల్ తెప్పించుకున్నా మని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి బాలయ్య తెలిపారు. నేడు శిథిలావస్థలో బీసీ హాస్టల్ భవనం ఉందంటే చాలా బాధగా ఉందని అన్నారు. హాస్టల్‌కు నిధులు మంజూరు చేసి బీసీ విద్యార్థులకు తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడును కలిసి అభినందిస్తున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



టీటీడీ బోర్డు సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన జంగా కృష్ణమూర్తిని కలిసి అభినందించిన అనంతరం స్వామి దర్శనానికి వెళ్తున్న యరపతినేని, జంగా కుటుంబసభ్యులు

పిడుగురాళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్‌గా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన బొల్లినేని రాజగోపాల్ నాయుడును బుధవారం తిరుమలలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కలిశారు. తిరుమల ప్రతిష్ఠను పెంచేలా చంద్రబాబు నూతన కమిటీని ఎంపిక చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం రాజగోపాల్‌నాయుడును యరపతినేని పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన జంగా కృష్ణమూర్తిని కూడా యరపతినేని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని, తనయుడు సాయినిఖిల్ స్వామివారిని దర్శించుకున్నారు. బోర్డు సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన జంగా కృష్ణమూర్తి కూడా కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు.

శ్రీవారిని దర్శించిన ఎమ్మెల్యే ప్రవీణ్



వేద పండితుల ఆశీర్వచనాలు పొందిన ఎమ్మెల్యే ప్రవీణ్ మిత్ర బృందం

పెదకూరపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తన మిత్ర బృందంతో కలసి బుధవారం తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనాలను అందుకున్నారు.

హైదరాబాద్‌లో ఘనంగా శ్రీధర్ జన్మదిన వేడుకలు



పెదకూరపాడులో కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేస్తున్న రాజు, లీలావతి, ముంతాజ్ తదితరులు



హైదరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఆయన హైదరాబాద్‌లో ఉండగా నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు వెళ్లి కొమ్మాలపాటి శ్రీధర్‌తో కేక్‌ను కట్ చేయించారు. పలువురు కొమ్మాలపాటి శ్రీధర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజు చేసుకోకుండా దూరంగా ఉన్నప్పటికీ పార్టీ నేతలు హైదరాబాద్ వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు భాష్యం నవీన్, టూరిజం శాఖ డైరెక్టర్ కుర్రా అప్పారావు, పెదకూరపాడు నియోజకవర్గ నాయకులు అర్తిమళ్ళ రమేష్, మద్దినేని నరసింహారావు, నంబూరి బలరామ్, డాక్టర్ గుడిపూడి చినరాజు, కృష్ణంనేని చిన్న, వడ్లమూడి కిషోర్, వడ్లమూడి అప్పారావు, నాతాని శ్రీనాథ్, పొన్నెకంటి కోటేశ్వరరావు, నలజాల సదాశివరావు, బత్తిన వెంకటరావు, శాఖమూరి రాయ్, వాసిరెడ్డి రవిచంద్ర తదితరులు ఉన్నారు.

పెదకూరపాడులోని టీడీపీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, టీడీపీ జిల్లా నియోజకవర్గ నేతలు బెల్లంకొండ రామగోపాలరావు, గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, ఘంగా పాపయ్య, మద్దినేని వెంకట సత్యనారాయణ, గుంటుపల్లి కోటేశ్వరరావు, షేక్ అజ్మల్లా, మక్కెన సాగర్, నెల్లూరి మల్లికార్జున్, జాగర్లమూడి రఘు, బత్తుల నారాయణ తదితరులు కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొమ్మాలపాటి జన్మదినాన్ని పురస్కరించుకొని భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అభిమానాన్ని చాటుకున్నారు.

సత్తెనపల్లి పరివర్తనలో...

అచ్చంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు సత్తెనపల్లిలోని పరివర్తన ఆశ్రమంలో నిర్వహించినట్టు అచ్చంపేట మండల టీడీపీ నాయకులు తెలిపారు. ఆశ్రమంలో పిల్లలకు ఉదయం టిఫెన్‌తో పాటు, మధ్యాహ్నం, సాయంత్రం భోజన ఏర్పాట్లు చేసినట్టు అచ్చంపేట మాజీ ఎంపీటీసీ సందెపోగు సామేలు తెలిపారు. శ్రీధర్ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో కంభంపాటి కిరణ్, బీసీ నాయకులు తిరువాయి పాటి ఆంజనేయులు, చెరుకుంపాలెం సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావు, అంగులూరి తిరుపతిరావు, కొమ్మవరపు దిబ్బయ్య, కత్తుల కిషోర్, మేకల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

సత్తెనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వంచే నూతనంగా ప్రవేశపెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్‌పై బుధవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్లో సమావేశం జరిగింది. సమా వేశంలో పాల్గొన్న కమిషనర్ షమ్మి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి గణనపై పట్టణంలో ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. నిరుద్యోగ యువతీ, యువకుల వివరాలను పూర్తిగా సేకరించాలని సచివాలయ సిబ్బందికి, కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ సాంబశివరావు, టీపీఎస్‌లు, మున్సిపల్ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

దాచేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని దాచేపల్లి మండలం భట్రుపాలెం గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం సమీపంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బాలాజీనాయక్, జనసేన మండల ఉపాధ్యక్షుడు అనిల్‌నాయక్, భట్రుపాలెం గ్రామ పార్టీ నాయకులు వెంకట్‌నాయక్‌లు బుధవారం ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు 30 జట్లు హాజరయ్యాయి. విజేతలకు కార్తీక పౌర్ణమి రోజున దేవాలయం వద్ద నగదు, షీల్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

నివాసాల మధ్య వైన్స్ షాపు వద్దు



వైన్స్ షాపు ముందు ఆందోళన చేస్తున్న మహిళలు

రాజుపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజుపాలెంలో నివాస గృహాల మధ్య వైన్స్ షాపు వద్దని మహిళలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ వైన్స్‌షాపు ఇక్కడ సుమారు నెలరోజుల క్రితం ఏర్పాటు చేశారని, ఏర్పాటు చేసే సమయంలో ఇక్కడ షాపు రెండు, మూడు రోజులు మాత్రమే ఉంచుతామని తర్వాత ఇక్కడ నుంచి తొలగించి వేరే చోట ఏర్పాటు చేస్తామని చెప్పటంతో తాము మౌనంగా ఉన్నామని కానీ ఇప్పటి వరకు ఇక్కడ నుంచి షాపు తొలగించకపోవటంతో తాము ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. షాపు తొలగించాలని గ్రామ పెద్దలకు, అధికారులకు తెలియజేశామని వారు పట్టించుకోకపోవడంతో బుధవారం ఆదోళనకు దిగామన్నారు. వైన్స్ షాపునకు దగ్గరగా పాఠశాల ఉందని, దీంతో చదువుకునే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇక్కడ ఉన్న వైన్స్‌షాపును ప్రధాన రహదారి ప్రక్కకు తీసుకువెళ్లాలని వారు డిమాండ్ చేశారు.

స్కౌట్స్‌లో రాజ్య పురస్కార్‌కు మహేష్

నకరికల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో అత్యున్నత పురస్కారమైన రాజ్య పురస్కార్‌కు కండ్లకుంట హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న చీమలమర్రికి చెందిన ఉప్పలపాటి మహేష్ ఎంపికైనట్లు హెచ్ఎం వరప్రసాదు బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది విద్యార్థులను ఎంపిక చేయగా పల్నాడు జిల్లా నుంచి మహేష్ ఎంపికైనట్లు ఆయన చెప్పారు. 75వ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలో మహేష్‌కు ఈ బహుమతి ప్రదానం చేస్తారని వివరించారు.

పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

● జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి హరి

మాచర్లటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై వైసీపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సరస్వతి భూముల పరిశీలనకై పల్నాడుకు వచ్చిన డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్‌పై వైసీపీ నేతలు అంబటి రాంబాబు, పేర్ని నాని, కాసు మహేష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వందల ఎకరాల భూములను తీసుకొని ఫ్యాక్టరీ నిర్మించకపోగా అటవీ భూములను సైతం రెవెన్యూ భూములుగా మార్చి అవినీతికి పాల్పడ్డారన్నారు. స్వార్థ రాజకీయాల కోసం జగన్ ఆస్తులు పెంచుకున్నారని, పవన్‌కల్యాణ్ సొంత నిధులు ఖర్చు చేసి రాజకీయం చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత ప్రభుత్వం కాదని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఏర్పడిన ప్రభుత్వమని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు, గుండెబోయిన సాంబశివరావు, మల్లయ్య, శ్రీను, వెంకటరమణ, షేక్ మదీన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలను వేగంగా అమలు చేస్తాం : ఎంపీడీవో



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కాశయ్య

నకరికల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తామని ఎంపీడీవో జీ.కాశయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మేసారపు అనురాధ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఇప్పటి వరకు చేపట్టి పనులకు సంబంధించి బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. నకరికల్లు మండలంలో 2.18 కోట్ల సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు మంజూరయ్యాయని ఏఈ సురేష్ తెలిపారు. జల జీవన్ మిషన్ కింద రూ.11.91 కోట్లు మంజూరయ్యాయని ఆర్అండ్ఎస్ ఏఈ తస్లీమా తెలిపారు. ఆధార్ కేంద్రాలను పెంచాలని ఎంఈవో కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కొందరు కార్యాలయ ఉద్యోగులు రికార్డులు పూర్తి స్థాయిలో ఆఫీసుకు అందించలేదని, దీని కారణంగా కొన్ని బిల్లులు, అభివృద్ధి పనులు ఆగిపోయాయని సభ్యులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే ఇలాంటి అంశాలకు సంబంధించి జడ్పీ సీఈవో దృష్టికి తీసుకువెళ్లామని ఎంపీడీవో కాశయ్య ప్రజా ప్రతినిధులకు తెలిపారు. 6,800లకు పైగా ఎన్‌పీసీఐ డేటా పెండింగ్ ఉందని, దీని వల్ల లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను అందుకోలేరని, ఇందుకు వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి బాధ్యతాయుతంగా వ్యవహరించి వాటిని పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : పట్టణ ఎస్ఐ

మాచర్లటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ బాలయ్య, జ్యోతిష్ కుమార్, రాజు, రాఘవేంద్ర, చైతన్య, శ్రవణ్, సతీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

24 వేల ఎకరాల్లో పంటల సాగు

ఏవో యలమందారెడ్డి

ఫటా ఫట్



కారంపూడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కారంపూడి మండల పరిధిలో రైతులు 24 వేల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన పంట పొలాలను సందర్శిస్తూ రైతులకు పలు సూచనలు చేస్తున్నాం. ఏవో యలమందారెడ్డితో ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫటాఫట్..

ప్ర: మండలంలో ఏయే పంటలు సాగవుతున్నాయి?

జ: కారంపూడి మండలపరిధిలో రైతులు వరి, మిర్చి, పత్తి, కంది పంటలు సాగు చేశారు.

ప్ర: పత్తిలో గులాబిరంగు పురుగు ఉధృతి ఉందా?

జ: ఈ ఏడాది మండలపరిధిలో సాగు చేసిన పత్తిలో ఎక్కడా కూడా గులాబిరంగు పురుగు ఉధృతి కనిపించలేదు. ప్రస్తుతం పత్తి దిగుబడి దశలో ఉంది.

ప్ర: ఎరువుల వినియోగంపై మీరిచ్చే సూచనలు ఏమిటి?

జ: రైతులకు పంటలో ఎరువులు ఏ దశలో వినియోగించాలో సూచిస్తున్నాం. భాస్వరం ఆఖరి దుక్కులో వేసుకోవాలి. నత్రజని తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు వేయాలి. పొటాషియం రోగ నిరోధక శక్తినిస్తుంది.

ప్ర: రైతులకు ఎటువంటి సలహాలు ఇస్తున్నారు?

జ: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచిస్తున్నాం. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. పంటలను చీడపీడలు ఆశిస్తే మాదృష్టికి తీసుకొస్తే పరిష్కార మార్గాలు చూపుతున్నాం.

ఎన్నికల హామీలన్నింటినీ నెరవేరుస్తాం

● కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని, ఇందులో భాగంగా ప్రతి మండల కేంద్రంలో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని నరిసెట్టి కల్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గస్థాయి పాస్టర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాస్టర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలతోపాటు గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ముందుగా ఎమ్మెల్యేకి పాస్టర్లు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఆశీర్వదించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, పేరువాల మల్లయ్య, ఆనందరావు, నియోజకవర్గ పాస్టర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలి



వైద్య శిబిరంలో ఆపరేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెన పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో బుధవారం అమృత హాస్పిటల్ గుంటూరు వారిచే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మోకాళ్ల మార్పిడి ఉచిత సర్జరీలు చేసేందుకు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఉచిత కంటి ఆపరేషన్‌ల శిబిరం, మెడికల్ క్యాంపు, జాబ్ మేళాలు నిర్వహించారు. శిబిరానికి రెండు వందల మంది వరకు హాజరై మోకాళ్ల మార్పిడి సర్జరీలకు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారు. వారందరికీ ధ్రువపత్రాలను కన్నా అందించారు. కార్యక్రమంలో నాయకులు చౌట శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, కోమటినేని శ్రీనివాసరావు, కంభాల వెంకటేశ్వరరావు, అంచుల నరసింహారావు, కట్టా రమేష్, కట్టా శంకరరావుతో పాటు అమృత ఆస్పత్రి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జున కొండను సందర్శించిన శ్రీలంక దేశస్తులు



లాంచీలో కొండకు వెళ్తున్న శ్రీలంక దేశస్తులు

మాచర్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జు న కొండను శ్రీలంక దేశానికి చెందిన 50 మందితో కూడిన బృందం బుధవారం సందర్శించింది. వీరు మండలంలోని విజయపురిసౌత్‌లో గల లాం చీ స్టేషన్ నుంచి లాంచీలో కొండకు చేరుకున్నారు. కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్థూపం, బోధివృక్షంలను వీక్షించారు. నాగార్జునసాగర్ ప్రాముఖ్యంపై పర్యాటక శాఖ ఉద్యోగులు శ్రీలంక దేశస్తులకు వివరించారు.

ల్యాబ్ టెక్నీషియన్లు నిత్యం అందుబాటులో ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్



రెంటచింతల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్

రెంటచింతల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వివిధ రోగాల నిర్ధారణలో కీలక పాత్ర వహించే ల్యాబ్ టెక్నీషియన్లు నిత్యం అందుబాటులో ఉండాలని జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్ కోరారు. బుధవారం రెంటచింతలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమ, రమాదేవి, మలేరియా సూపర్‌వైజర్ అంకమరావు, ఎంపీహెచ్‌ఈవో అంజనేయులు, ఎన్ కోటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల పీహెచ్‌సీ తనిఖీ

గురజాలటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను బుధవారం మలేరియా జిల్లా అధికారి రవి రత్నాకర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మెడికల్ లేబరేటరీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కార్యకర్తలతో ఫీల్డ్ విజిట్ చేయించి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

ప్రతి దరఖాస్తును విచారించాలి : తహసీల్దార్

పిడుగురాళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎన్నికకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందిన ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా విచారించి అందజేయాలని తహసీల్దార్ మధుబాబు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్సీ దరఖాస్తులపై బుధవారం సమీక్ష నిర్వహించారు. సాయంత్రానికి గురజాల నియోజకవర్గం పరిధిలోని పిడుగురాళ్ళ, దాచేపల్లి, మాచవరం, గురజాల మండలాలు, పట్టణాల పరిధిలో సుమారు 7వేల పైచిలుకు ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తులు అందాయని కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు.

● రెంటచింతల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ముగిసిందని ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్ చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 985 దరఖాస్తులొచ్చాయని అన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి పరిశీలన ఉంటుందని బీఎల్వోలు వచ్చినప్పుడు డిగ్రీ ఒరిజనల్ సర్టిఫికెట్ చూపించాలన్నారు.

ఎన్జీరంగా.. రైతు బాంధవుడు



నేడు 124వ జయంత్యుత్సవాలు

స్వాతంత్ర్య సమరయోధుడిగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, రైతు ఉద్యమ నేతగా పేరుగాంచారు ఆచార్య ఎన్జీరంగా. ఆయన పూర్తి పేరు గోగినేని రంగనాయకులు. ఆయన పోరాటయోధుడిగానే కాకుండా సాహిత్య వేత్తగా గుర్తింపు పొందారు. సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసి, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డులు అందుకున్నారు. గాంధీజీని అనుసరించిన ఆయన కాంగ్రెస్‌తో విబేధించి స్వతంత్ర పార్టీ, కృషికార్ లోక్ పార్టీలను స్థాపించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన సందర్భాలూ ఉన్నాయి. రైతుల సంక్షేమం కోసం అనుక్షణం పోరాడిన ఎన్జీరంగా, రాజకీయాలోకి రైతులను తీసుకురావాలని నిడుబ్రోలులో రామానీయుడు రాజకీయ పాఠశాలను స్థాపించి తదనంతర కాలంలో పూర్తిస్థాయి రాజకీయ పాఠశాలగా రూపొందించారు. ఆయన 124వ జయంత్సోవాలను నవంబరు 7వ తేదిన ఘనంగా నిర్వహించేందుకు పొన్నూరు, గుంటూరులోని లాం, ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.


పొన్నూరుటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్జీరంగా గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో నవంబరు 7, 1900 సంవత్సరంలో గోగినేని అచ్చమాంబ, నాగయ్య దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులోని ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న ఆయన గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల నుంచి పట్టభద్రులయ్యారు. 1926లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రం అభ్యసించారు. తిరిగి భారతదేశానికి వచ్చి మద్రాసులోని పచ్చియప్ప కళాశాలలో ఆర్థికశాస్త్ర ఆచార్యులుగా 1930 వరకు పనిచేసారు. 1924లో మాచవరం గ్రామానికి చెందిన భారతీదేవిని వివాహం చేసుకున్నారు. ఆచార్యులుగా పనిచేసే సమయంలో మహాత్మాగాంధీ పిలుపు మేరకు ఉద్యమాన్ని వదిలి స్వాతంత్ర్య ఉద్యమ సమరంలో అడుగు పెట్టారు.

ఎన్జీరంగా రచనలు

ఆచార్య ఎన్జీరంగా ఆంగ్లబాషలో 65 పుస్తకాలు, తెలుగులో 15 పుస్లకాలను రాసారు. రైతు కూలీల కోసం, ప్రత్యేక ఉద్యమాన్ని రూపొందించి మహాత్మగాంధీతో జరిగిన చర్చల సారాంశాని బాపు ఆశీస్సులు పేరుతో పుస్తకం రచించారు. నేలగిరి కొండజాతులు, ఆధునిక రాజ్యాంగ సంస్థలు, కాకతీయ నాయకులు, కిసాన్ అండ్ కమ్యూనిటీస్, ఛాలెంజ్ ఆఫ్ ద వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్, రైతు భజనావళీ, ప్రపంచ ధనిక వాదం, ధన్యజీవి నేతాజీ, శారదార్పన, భారతీదేవి స్మృతులు, విప్లవ రైతాంగం, ఫైట్ ఫర్ ఫ్రీడమ్, పీజెంట్స్ అండ్ కోఆపరేటీవ్ ఫార్మింగ్, ఎకనామిక్ ఆరనైజేషన్ ఆఫ్ ఇండియన్ విలేజెస్, ది ఎకనామిక్స్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ వంటి రచనలే కాకుండా ఆర్థిక శాస్త్రంలో పలు పరిశోధన గ్రంథాలను రచించారు.

ఉద్యమ నేపథ్యంలో.....

గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగు పెట్టిన ఎన్జీరంగా తదనంతర కాలంలో రైతులలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి రైతు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉద్యమంలో రైతులను భాగస్వాములను చేసి ఉద్యమాలను పతాకాస్థాయికి తీసుకెళ్ళారు. అదే సమయంలో 1931 డిసెంబర్‌లో అరెస్టు అయి ఏడాది కాలం జైలు శిక్ష అనుభవించారు. 1933 సంవత్సరంలో మహాత్మాగాంధీజి చేతుల మీదుగా నిడుబ్రోలులో రామానీయుడు వయోజన రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. 1940లో మద్రాసులో శాసన ఉల్లంఘన ఉద్యమం చేసి జైలుకు వెళ్లారు. 1941లో జైలు నుంచి విడుదలైన రంగాను తిరిగి రాయవెల్లూరు జైలుకు పంపి 1942లో విడుదల చేసారు. తిరిగి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనందుకు 1942 నవంబరున రంగాను నిర్బంధించిన ఆంగ్లేయులు రాజపుట్లానా వద్ద ఉన్న దామో జైలులో ఉంచి 1944లో విడుదల చేసారు. జైలులో ఉన్న కాలంలో ఎన్జీరంగా సాహిత్యంపై మక్కువతో అనేక రచనలు చేసారు. మొత్తం 6 ఏళ్ల జైలు జీవితం గడిపారు.



మహాత్మాగాంధీతో ఆచార్య ఎన్జీరంగా

ఎందరికో రాజకీయ ఓనమాలు....

నిడుబ్రోలులో ఏర్పాటు చేసిన రామానీడు రాజకీయ పాఠశాల ద్వారా దేశవాప్తంగా ఎంతో మంది రైతులను, సామాన్యులను ఉత్తమ రాజకీయ వేత్తలుగా తీర్చిద్దారు. మహాత్మగాంధీజి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పాఠశాలకు దేశం నలుమూల నుంచి ఉత్తములను ఎంపిక చేసి పాఠశాల్లో రాజకీయ ఓనమాలు దిద్దించారు. ప్రారంభంలో రాజకీయ ఆర్థిక, కార్మిక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలో శిక్షణ ఇచ్చారు. అయితే ఈ పాఠశాలను కాలక్రమంలో రాజకీయ పాఠశాలగా రూపాంతరం చెందించారు. ఈ పాఠశాల దేశానికి ఎంతో మంది ముఖ్యమంత్రులను, మంత్రులను అందించింది. ఆచార్యా ఎన్జీరంగా శిషులుగా గుర్తింపు పొందిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, కొణిజేటి రోశయ్య. ఆర్ ఎం సింగ్ దేవ్ (ఒరిస్సా), చిమన్‌భాయ్ పటేల్ (గుజరాత్), అన్నాదురై (తమిళనాడు), దామోదరం సంజీవయ్య, బెజవాడగోపాళరెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి తదితరులు ఈ పాఠశాల్లో రాజకీయ పాఠాలు నేర్చుకున్నవారే అంతే కాకుండా సర్ధార్ గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, రాజగోపాల్ నాయుడు, వీరాచారి, జీయర్ దాస్, అనగాని భగవంతరావు, యడ్లపాటి వెంకట్రావు, గోవాడ పరంధామయ్య, ఔతు రామిరెడ్డి తదితరులు మత్రులుగా పనిచేసారు. ఈ పాఠశాలో విద్యను అభ్యసించిన ఎందరో దేశంలో పలు రాష్ట్రాలో పార్లమెంట్ సభ్యులుగాను ఎంపికైయ్యారు. నేటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సైతం ఆచార్య ఎన్జీరంగా శిష్యులుగా గుర్తింపు పొందారు.



అనేక రంగాల్లో గుర్తింపు పొందిన ఆచార్య ఎన్జీరంగా 124వ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గుంటూరులోని లాం, ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో నేడు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చన్నయుడు, అనగాని సత్యప్రసాద్‌లు హాజరు కానున్నారు. అంతే కాకుండా జిల్లాలోని ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, బూర్ల రామాంజనేయులు. రైతు సంఘం నాయకులు యలమంచలి శివాజి, వడ్డే శోభనాదీశ్వరరావు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు తదితరులు హాజరు కానున్నారు.

రాజకీయ అరంగేట్రం

1936లో భారతీయ కాంగ్రెస్ లక్నో సమావేశం సందర్భంగా ఎన్జీరంగా అఖిల భారత కిసాన్ సభ స్థాపించి మొదటి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దీని ద్వారా జమిందారీ వ్యవస్థ రద్దు చేయాలని గ్రామీణ రుణాలను రద్దు చేయాలని పోరాటం జరిపారు. 1946లో రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా ఎన్నికైయ్యారు. 1952లో తాత్కాలిక పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైయ్యారు. అయితే 1951లో కాంగ్రెస్ పార్టీ నుంచి వేరుపడి కృషి కార్ లోక్‌పార్టీని స్థాపించారు. 1955లో కాంగ్రెస్, ప్రజా పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికలో విజయం సాధించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కోరిక మేరకు కృషి కార్ లోక్‌పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసారు. 1957లో తెనాలి నంచి లోక్ సభకు ఎన్నికైయారు. అయితే నెహ్రూ విధానాలను వ్యతిరేకిస్తూ తిరిగి కాంగ్రెస్ పార్టీని వీడారు. తదనంతర కాలంలో స్వతంత్ర పార్టీని స్థాపించారు. 1962లో జరిగిన సార్వత్రిక ఎన్నికలో 25 స్థానాలను గెలుపొంది బలమైన ప్రతిపక్షంగా స్వతంత్ర పార్టీని నిలిపారు. 1972లో ఇందిరా గాంధీ నేత్రత్వంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1991 వరకు సుదీర్ఘ కాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును అందుకున్నారు. మొత్తం 60 ఏళ్లపాటు ఉభయ పార్లమెంట్ సభ్యులగా పనిచేసి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా..





తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా గురజాలకు చెందిన జంగా కృష్ణమూర్తి, మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవి గురువారం తిరుమలలో ప్రమాణ స్వీకారం చేశారు.

జాతీయ స్థాయి తైక్వాండోకు విజ్ఞాన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య),నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని వీసీ ఆచార్య పీ నాగభూషణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు సామ్యూల్‌చార్లీ, డీ హర్షిత్, వీ నిఖిల, ఎండీ కరిష్మ, ఎంఎం ఆషంటే తదితరులు జాతీయ స్థాయిలో త్వరలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు అభినందించారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల

◆ ఈ నెల 9న ప్రవేశ పరీక్ష..

◆ రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. గురువారం వరకు అపరాధ రుసుము లేకుండా ప్రవేశ పరీక్ష ఫీజు రూ.500 చెల్లించవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేయని అభ్యర్థులు నేరుగా టెన్త్ క్లాస్, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా అభ్యర్థి ఫొటోతోపాటు రూ.1500 తత్కాల్ ఫీజు చెల్లించి, పరీక్ష జరిగే 9వ తేదీన నేరుగా హాజరు కావచ్చన్నారు. సంబంధిత ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 10న సాయంత్రం విడుదల చేస్తామని చెప్పారు.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు

(5వ పేజీ తరువాయి)

వృత్తి విద్యాకళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సులో శిక్షణ ఇచ్చి ఎంసెట్, జేఈఈ , నీట్ పరీక్షలకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటిరియల్, పుస్తకాలు ఎన్‌సీఆర్‌టీ నుంచి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారు.

ఆర్థిక ఇబ్బందులతో శిక్షణకు దూరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద,బడుగు బలహీనవర్గాల విద్యార్థులే. వారికి పది స్థాయిలో మంచి మార్కులు వచ్చినా కార్పొరేట్,ప్రైవేటు కళాశాలల్లో చదివే స్తోమత లేక ప్రభుత్వ కళాశాల్ని ఆశ్రయిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో కూడా మంచి మార్కులు సాధిస్తున్నా జాతీయ స్థాయి శిక్షణ తీసుకోలేక పోతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తరువాత ఎంసెట్, జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ , నీట్ కోసం రూ. 10వేల నుంచి రూ. 20వేల వరకు ఫాస్ట్‌ట్రాక్ శిక్షణ కోసం వెచ్చించాల్సి వస్తోంది. ఇంత మొత్తం వెచ్చించలేక పేద విద్యార్థులు ఇటువంటి శిక్షణకు దూరమౌతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఇచ్చే శిక్షణ వారికి ఎంతో ఉపయోగ పడనుంది.

పోటీ పరీక్షలకు ఎంపిక ఇలా...

ఇంటర్ చదివే విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్, జేఈఈ శిక్షణ కోసం ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఈ పరీక్ష నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ నారాయణ కళాశాల సహకారంతో శిక్షణ ఇవ్వనున్నారు. ఆ కళాశాలలు రూపొందించి మెటీరియల్‌తో పాటు అనేక మాక్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాలల్లోనే దశల వారీగా శిక్షణ ఇచ్చి



పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఇదిలా ఉంటే జాతీయస్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థుల్ని సిద్ధం చేసేందుకు అవసరమైన విధి విధానాలు ఇంకా రాలేదని, సంక్రాంతి సెలవుల తరువాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో దందా

- వీరి అనుమతి లేకుండా లారీలకు సరుకు లోడింగ్ చేయకూడదంట
- చేస్తే అడ్డుకొని తీరుతామని బెదిరింపులు
- తాజాగా నాలుగు లారీల టైర్లు గాలి తీసేసి అడ్డగింత

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో కొంతమంది లారీ యజమానులు ఒక మాఫియాగా ఏర్పడి దందా కొనసాగిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి ఎగుమతి చేయడానికి వీళ్ల నిర్ణయించిన లారీలలోనే రవాణా చేయాలని హుకూం జారీ చేస్తున్నారు. వీళ్లని కాదని ఎవరైనా లారీలు పెడితే వాటిని అడ్డుకొని దాడికి తెగబడుతున్నారు. లారీ టైర్లలో గాలి తీసేసి అడ్డగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల అండ దండలతో యథేచ్ఛగా దందా కొనసాగించారు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత అధికార పార్టీ నేత ఒకరితో ఒప్పందం చేసుకొని తిరిగి దందా కొనసాగిస్తున్నారు. తాజాగా బుధవారం సాయంత్రం చిలకలూరిపేట రోడ్డులోని వేబ్రిడ్జి వద్ద ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి లోడింగ్ చేసిన నాలుగు లారీలను అడ్డుకుని దౌర్జన్యానికి దిగారు.

మిర్చియార్డు నుంచి ఎక్కువ సరుకు ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి జరుగుతుంటుంది. అక్కడి నుంచి ఆసియా ఖండంలోని కొన్ని దేశాలకు ఎక్స్‌పోర్టు అవుతుంది. దీంతో నిత్యం పశ్చిమ బెంగాల్‌కు మిర్చి లోడింగ్‌లు జరుగుతుంటాయి. ఇదే అదనుగా కొంతమంది పలుకుబడి కలిగిన లారీ యజమానులు నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్‌ని ఏర్పాటు చేసి సిండికేట్‌గా మారారు. ఒక్కో లారీకి రూ. 1.50 లక్షల కిరాయిని వీళ్ల నిర్ణయించారు. లారీ యజమానులంతా తమ అసోసియేషన్‌లో పేరు రిజిస్టర్ చేసుకొంటే లారీలకు సీరియల్ పెడతామని చెబుతున్నారు. తమ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ లారీ పెడతానికి వీల్లేదని హుకూం జారీ చేశారు. అసోసియేషన్‌లో సీరియల్‌కు లారీని పెడితే నెలకు ఒకటి/రెండు ట్రిప్పులకంటే ఎక్కువ పడే పరిస్థితి లేదు. మరోవైపు అసోసియేషన్ నేతలు మాత్రం వాళ్ల లారీలకు ఎలాంటి సీరియల్ లేకుండా కిరాయికి పెట్టేసి రూ. లక్షలు పోగేసుకొంటున్నారు.



చిలకలూరిపేట రోడ్డులో మిర్చి లారీ యజమానుల మాఫియా అడ్డగించిన మిర్చి లారీ

ఈ వివాదం గత కొన్ని నెలల నుంచి కొనసాగుతూనే ఉన్నది. పోలీసుస్టేషన్‌కు వెళ్లినా వివాదం పరిష్కారం కాలేదు. దీంతో మళ్లీ లారీ ఓనర్స్ మాఫియా బుధవారం రెచ్చి పోయింది. అసోసియేషన్ పేరుతో ఉన్న కారులో వచ్చి ఎక్స్‌పోర్టుకు పెట్టిన లారీ యజమానిపై దౌర్జన్యానికి దిగారు. అదేమని ప్రశ్నించినందుకు లారీ టైర్లలో గాలి తీసేశారు. దీనిపై జిల్లా యంత్రాంగం, పోలీసులు స్పందించి కఠిన చర్యలు చేపట్టకపోతే శాంతిభద్రతల సమస్యకు దారి తీసే అవకాశం ఉన్నది.

ముందస్తు పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ

- పెరుగుతున్న కేసులు
- జిల్లాలో కేన్సర్ స్ర్కీనింగ్‌కు రంగం సిద్ధం
- నేడు జాతీయ కేన్సర్ డే

- కొన్ని పెద్ద ఉల్లిపాయలు వలవగానే పైపొరలో లేత పసుపు రంగులో ఫంగస్ మచ్చలు కనిపిస్తాయి. వీటిని చాల మంది పట్టించుకోరు. అదే ఉల్లిపాయలను కూరల్లో వాడుతుంటారు. కేన్సర్ వ్యాధులను కలిగించడంలో ఈ పంగస్ మచ్చలు ఉన్న ఉల్లిపాయాలు అగ్రస్థానంలో ఉంటాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.
- వంట చేసేటప్పుడు మిగిలిపోయిన నూనెలను దాచి మరోసారి వాడుతుంటారు. ఇలా ఒకటి, రెండు సార్లు వినియోగించగా మిగిలిపోయిన నూనెను వంటల్లో వాడటం ఆరోగ్యరీత్యా ప్రమాదకరం. తాలింపు సమయంలో ఈ నూనెల నుంచి వెలువడే ఘాటైన వాయువులు (ఫ్యూమ్స్) ఊపిరితిత్తుల కేన్సర్‌కు కారణమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.
- నిత్యజీవితంలో చాలా మంది ప్లాస్టిక్ కవర్లలో వేడిగా ఉంటే ఆహార పదార్ధాలు, టీలు, కాఫీలు తెచ్చుకొని తాగుతుంటారు. ఇది ఆరోగ్యరీత్యా మంచిది కాదు. ఆహార పదార్థాల్లో ప్లాస్టిక్ కవర్లకు ఎంతో దూరంగా ఉంటే కేన్సర్‌ను అంత దూరంగా ఉంచినట్లేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

గుంటూరు మెడికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో నానాటికి పెరుగుతున్న కేన్సర్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఏటా నవంబర్ ఏడవ తేదీన జాతీయ కేన్సర్ అవగాహన రోజుగా నిర్వహిస్తున్నారు. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2014 నుంచి దీనిని నిర్వహిస్తున్నారు. పలు రకాల కేన్సర్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నివారణ, చికిత్సల పట్ల అవగాహన కల్పించడమే ఈ రోజు ఉద్దేశం. ఏటా దేశంలో కొత్తగా 7 లక్షల కేన్సర్ కేసులు నమోదౌతున్నాయి. వీరిలో మూడు వంతుల రెండు వంతుల కేసులు వ్యాధి ముదిరిన దశలో వస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. పురుషుల్లో నోటి కేన్సర్, ఊపిరితిత్తులు, ఉదర కేన్సర్‌లు ఎక్కువగా కనిపిస్తుంటే, మహిళల్లో రొమ్ము కేన్సర్లు, గర్భాశయ ముఖద్వార, గర్భాయ, అండాశయ కేన్సర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బాధితుల్లో 60 శాతం మంది 35 నుంచి 65 ఏళ్ల వారే. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులు కేన్సర్‌కు కారణమౌతున్నాయి.

జిల్లాలో కేన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాన్ కమ్యూని కబుల్ డిసీజెస్ విభాగం పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా నవంబరు నెల నుంచి కేన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమం ప్రారంభించనున్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి ఆరోగ్య సమాచారం సేకరించనున్నారు. దీనికి సంబంధించి ప్రశ్నాపత్రాలను కూడా ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేసింది. నోటి కేన్సర్ రోగులను గుర్తించేందుకు పలు ప్రశ్నలను సంధిస్తారు. 'మీరు మసాలతో కూడిన ఘాటు ఆహార పదార్థాలు తినడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? నోటిలో తెల్లని/ఎర్రని మచ్చలు ఉన్నాయా? మానని పుండ్లు ఉన్నాయా? నోరు తెరవడంలో ఇబ్బందులు ఉన్నాయా? అనే పలు రకాల ప్రశ్నలను సంధించి వాటి సమాధానాలు రాబడతారు.

కేన్సర్ నివారణ ఇలా...

దైనందిత జీవితంలో ఆరోగ్యకరరమైన జీవనశైలి అవలంభిస్తే పలు రకాల కేన్సర్‌లను నుంచి రక్షణ లభిస్తుంది. పొగాకు ఉత్పత్తులకు పూర్తి దూరంగా ఉండాలి. మద్యపానం అలవాటు ఉన్న వారు దానిని మానుకోవాలి. ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు అధికంగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి రోజూ 30 నిమిషాల పాటు శారీరక వ్యాయామం చేయాలి. రేడియేషన్‌కు, అతి నీలలోహిత కిరణాలు శరీరం మీద పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. కుటుంబంలో ఎవరైనా కేన్సర్‌తో మరణించిన చరిత్ర ఉంటే సంబంధిత కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం.

బ్రెస్ట్ కేన్సర్ స్ర్కీనింగ్

మహిళల్లో రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్‌లను తొలి దశలో గుర్తించేందుకు సర్వేలో కొన్ని ప్రశ్నావళిని చేర్చారు. బ్రెస్ట్ కేన్సర్ స్ర్కీనింగ్ సర్వేలో..రొమ్ములో గడ్డలు ఉన్నాయా? నిప్పిల్స్ నుంచి ద్రవాలు కారుతున్నాయా? రొమ్ము ఆకారంలో మార్పు వచ్చిందా? రుతుక్రమంలో కాకుండా ఇతర సమయాల్లో కూడా రక్తస్రావం జరుగుతుందా? వంటి ప్రశ్నలను వేస్తారు. ఇదేరీతిలో గర్భాశయ కేన్సర్, ఇతర కేన్సర్‌లకు సంబంధించిన ప్రశ్నావళిని కూడా సిబ్బందికి అందజేశారు. వాస్తవానికి ఈ సర్వేలో కేవలం కేన్సర్ వ్యాధుల స్ర్కీనింగ్ నే కాకుండా వ్యక్తిగత అలవాట్లు, ఆరోగ్య పూర్తి వివరాలు, దైనందిత జీవనం, సాధారణ కుటుంబ వివరాలను కూడా సేకరిస్తారు. ఈ నెలాఖరు లోపు జిల్లాలో కేన్సర్ సర్వేను ప్రారంభించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సన్నాహాలు చేస్తోంది.



స్ర్కీనింగ్ పరీక్షలతో కేన్సర్‌పై విజయం

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి



కేన్సర్‌పై విజయం స్ర్కీనింగ్ పరీక్షలతోనే సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. ముందస్తు స్ర్కీనింగ్ పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ లభిస్తుందని ఆమె వివరించారు. హైరిస్క్‌లో ఉన్న వారు కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. గురువారం ఉదయం పది గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అన్ని ప్రాంతాల్లో కేన్సర్ అవగాహన ర్యాలీలు నిర్వహించాలని డాక్టర్ విజయలక్ష్మీ ఆదేశం చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ర్యాలీలు జరపాలని ఆమె తెలిపారు. ఈ ర్యాలీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు.

కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల నుంచి విద్యార్థిని పరార్

● సాయంత్రానికి ఆచూకీ లభ్యం

వినుకొండ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల్లో చదివే విద్యార్థిని బుధవారం పాఠశాల నుంచి పరారైంది. సమాచారం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పలు ప్రాంతాల్లో గాలించి, ఎట్టకేలకు సాయంత్రానికి విద్యార్థిని ఆచూకీ కనుగొన్నారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా సత్తిరాజు బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఆర్ ఏఎస్పీ సత్తిరాజు

నరసరావుపేట లీగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా వీ సత్తిరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పల్నాడు జిల్లాకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందజేశారు. ఈ సదర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పాటుపడాలని సూచించారు.



అక్రమ మద్యం స్వాధీనం

వినుకొండ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెరుమాలపల్లిలో ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేపట్టగా గ్రామానికి చెందిన కొత్తమాసు రాము అనధికారికంగా మద్యం అమ్ముతుండగా సుమారు 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని రాముపై కేసున మోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నూజెండ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలోని సీతారామపురం సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పరిమి శ్రీను వ్యక్తి గత పనులపై వినుకొండ వస్తుండగా ఆర్టీసీ బస్సును అధికమించబోయే సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో గాయపడిన శ్రీనును ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు వినుకొండ వైద్యశాలకు తరలించారు.

రేషన్ షాపులో అధికారుల తనిఖీలు

వినుకొండ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న ఆరోపణలపై రేషన్ డీలర్ బ్రహ్మారెడ్డి షాపులో అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని చాప బిల్డింగ్ సందులోని 4వ నంబరు షాపు నుంచి మంగళవారం రాత్రి ఆటోలో రేషన్ బియ్యం, పంచదార, కందిపప్పును బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారంటూ స్థానికులు వెంటాడి ఆటోను నిలిపివేశారు. సీఎస్‌డీటీ విద్యాసాగర్‌కు సమాచారం అందించడంతో నల్లబజారుకు తరలిస్తున్న 1.5 క్వింటాల కంది పప్పు, 3 క్వింటాల బియ్యం, 50 కేజీల పంచదారను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీలర్ బ్రహ్మారెడ్డి షాపులో తనిఖీలు నిర్వహించి సరుకు సక్రమంగా ఉందని తేల్చారు. పట్టుబడిన సరుకులు ఎక్కడి నుంచి వచ్చాయన్నది అధికారులకు 24 గంటలు గడిచినా అంతు చిక్కని ప్రశ్నలా ఉంది. బ్రహ్మారెడ్డి షాపు నుంచి రేషన్ సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు ఆటో యజమాని చెప్పినట్లు తెలిసింది. దీనిపై సీఎస్‌డీటీ విద్యాసాగర్‌ను ప్రశ్నించగా బ్రహ్మారెడ్డి షాపులో సరుకులు సక్రమంగా ఉన్నాయని, విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి ఆటోలో పట్టుబడిన రేషన్ సరుకులు బుధవారం రాత్రయినా ఎవరివి అనేది తేల్చక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ఎరువుల షాపుల్లో తనిఖీలు

వినుకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) ఎరువులు, పురుగు మందులు ఎవరైనా అధిక రేట్లకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అంజిరెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలో పలు ఎరువుల షాపులను వ్యవసాయ అధికారులు తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినుకొండలో ఎటువంటి అక్రమబయోలు అమ్మకాలు జరగడంలేదని, ఎవరైనా అమ్మకాలు చేపడితే 8331056960 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు వేద విద్యార్థి విష్ణు ఎంపిక

చిలకలూరిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేద స్కూల్ 9వ తరగతి విద్యార్థి సీహెచ్ విష్ణు ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్19 బాలుర నెట్ బాల్ విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9,10,11 తేదీలలో నెల్లూరు లో జరిగే నెట్‌బాల్ పోటీలలో పాల్గొననున్నాడు.

కావూరు హైస్కూల్లో డీఈవో తనిఖీ

చిలకలూరిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ బుధవారం మండలంలోని కావూరు హైస్కూలులో ల్యాబ్‌లు, టాయిలెట్లను ఆమె పరిశీలించారు. హైస్కూల్‌కు రాని విద్యార్థులను గుర్తించి వారిని తక్షణం హైస్కూల్‌కు వచ్చేలా చూడాలని కోరారు. కొందరు తల్లిదండ్రులను కూడా కలిసి వారి పిల్లలను స్కూలుకు పంపాలని కోరారు.

ఎనీటైమ్ వరి నారు @ ఐనవోలు



వరి నాట్లకు నారును సిద్ధం చేస్తున్న కూలీలు

నూజెండ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరి సాగు చేసే రైతులకు ఎనీటైమ్ ఐనవోలులో నారు అందుబాటులో ఉంటూ వరి నారుకు ఐనవోలు, గుండ్లకమ్మ ప్రాంతం చిరునామాగా మారింది. గుండ్లకమ్మ నదికి మే, జూన్ నెలల్లో నీటి ప్రవాహం మొదలైన నాటి నుంచి జనవరి, ఫిబ్రవరి వరకు పది నెలల పాటు వరి నారును రైతులు సాగు చేస్తూ ఎంతో మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. బోర్ల కింద, ఇతర నీటి వనరులు రైతులు వెంటనే వరి సాగు చేసుకునేందుకు పల్నాడు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి సుమారు వంద కిలో మీటర్లకు పైగా దూరాల నుంచి వరి నారు కోసం రావటం విశేషం. బీపీటీ 5204, ఎన్‌ఎల్‌ఆర్ 34449, 1010, ఎన్‌ఎల్‌ఆర్, షుగర్ లెస్ తదితర రకాల వరి నారు అందుబాటులో ఉంటుంది. ప్రతి నిత్యం వరి నారును కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చి ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా నారు తీసుకు వెళ్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలతో ఎన్‌ఎల్‌ఆర్ 34449, వరి పైరు దెబ్బతిన్న రైతులు మరలా వెంటనే వరి సాగు చేసుకునేందుకు నారు కోసం ఐనవోలు రావాల్సిందే. రెండవ పంట తొందరగా వేయాలనుకొనే రైతులు వరి నారు కొనుగోలు చేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత పది సంవత్సరాలుగా నాణ్యమైన విత్తనాలతో వరి నారు పెంపకం చేపట్టి రైతులు అధిక ప్రయోజనం పొందుతున్నారు. ఒక ఎకరం నాటు వేసేందుకు అవసరమైన మూడు సెంట్ల నారును రూ.2వేలు నుంచి రూ.4వేలు వరకు అమ్మకాలు జరుగుతుంటాయి. కూలీలకు మూడు వందల రూపాయలు కూలీ లభిస్తుంది. దీంతో వరి నారు పీకేందుకు పరిసర గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలు ఐనవోలులో అందుబాటులో ఉంటారు. గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతం, వినుకొండ - కురిచేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు నీటి సౌకర్యం, రవాణా సౌకర్యం ఉండటంతో ఐనవోలులో వరి నారు పెంపకం రైతులకు కలసి వచ్చే అంశంగా మారింది. ప్రధానంగా నారు పెంచేందుకు ఈ భూములు అనుకూలంగా ఉన్నాయి.

నారు పెంపకం లాభదాయకంగా ఉంది

● లగడపాటి కోటయ్య, రైతు



వరి నారు పెంపకం రైతులకు లాభదాయకంగా ఉందని ఐనవోలు గ్రామానికి చెందిన రైతు లగడపాటి కోటయ్య తెలిపారు. తనకు ఉన్న మూడు ఎకరాల్లో ప్రతి సంవత్సరం వరి నారు రెండు లేదా మూడుసార్లు వివిధ దశల్లో పోసి సుమారు రూ.80వేలు నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నట్టు వివరించారు.

నారు పెంపకంతో ఐనవోలుకు గుర్తింపు

● రాగాల వెంకటేశ్వర్లు, రైతు



వరి నారు పెంపకంతో ఐనవోలు ప్రాంతానికి గుర్తింపు లభించిందని గ్రామానికి చెందిన రైతు రాగాల వెంకటేశ్వర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. అందరి కంటే ముందుగా వరి నారు పోసి ముందస్తుగా నాట్లు వేసుకోవాలనే రైతులకు నారును అమ్ముతూ అనేక రైతు కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయన్నారు. అదే విధంగా వ్యవసాయ కూలీలకు ప్రతి నిత్యం పని దొరుకుతుందన్నారు.

అవినీతిపరులను వదిలిపెట్టం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



డ్వాక్రా ఏపీఎం, సీసీలు, వీవోఏలతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో డ్వాక్రా సంఘాలను అడ్డం పెట్టుకొని కొందరు అంతులేని అవినీతికి పాల్పడ్డారని, వారెవరినీ వదిలి పెట్టబోమని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. మూడు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, వీవోఏలతో కలసి తన నివాసంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మండలం ఇర్లపాడులో డ్వాక్రా మహిళల సంతకాలు ఫోర్జరీచేసి రూ.63లక్షలు అవినీతి చేశారన్నారు. అలాగే మూడు మండలాలకు సంబంధించి పలు గ్రామాల్లో కోట్ల రూపాయల అవినీతి చేశారని, వారెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. మూడు మండలాల పరిధిలో ఏపీఎంల అవినీతి వ్యవహారంపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తారని, సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన యానిమేటర్లపై కేసులు నమోదు చేయాలని ఎస్పీని కోరారు. అలాగే డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ ఉండి ఆసక్తి ఉంటే కేవలం లబ్ధిదారు పది శాతం సొమ్ము చెల్లిస్తే 90శాతం వడ్డీ లేని రుణాలు బ్యాంక్ ద్వారా ఆటోలు ఇప్పించే అవకాశం ఉంటుందన్నారు. డ్వాక్రా మహిళలకు లక్ష నుంచి రూ.10లక్షల వరకు రుణం ఎటువంటి షూరిటీలు లేకుండా ఇవ్వటానికి అవకాశం ఉందన్నారు. గత నాలుగు నెలల నుంచి యానిమేటర్లకు జీతాలు రావటం లేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడి యానిమేటర్లకు జీతాలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. .

తాగునీటి సరఫరా ఒక్క రోజు కూడా ఆగటానికి వీల్లేదు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్ళాలని ప్రజారోగ్యం విభాగం అధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ అమృత్‌కు సంబంధించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు వస్తే పట్టణానికి ప్రతి రోజు 24గంటలు తాగునీటి సరఫరా చేయవచ్చని తెలియజేశారు. సమగ్ర మైన నివేదిక తయారుచేసి ఇస్తే పురపాలకశాఖ మంత్రి నారాయణతో మాట్లాడి నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని, ముందుగా ఒక వారం పాటు పట్టణంలో జరుగుతున్న తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని, అలాగే రహదారులపై మరమ్మతుల సమయంలో తీసిన గుంటలను పూడ్చాలని అధికారులకు ప్రత్తిపాటి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ప్రజారోగ్య విభాగం ఎస్ఈ దాసరి శ్రీనివాసరావు, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ రవికుమార్, జేఈ నాగ బ్రహ్మాచారి, మెగా ఇంజనీరింగ్ సిబ్బంది, మునిసిపల్ డీఈ రహీం తదితరులు పాల్గొన్నారు.

దింతెనపాడులో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

దింతెనపాడు (యడ్లపాడు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మౌలికవసతుల కల్పనతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడు మండలం దింతెనపాడులో నూతనంగా నిర్మించనున్న బస్ షెల్టర్, రూ.14లక్షలతో ఏర్పాటుచేయనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, మండల టీడీపీ అధ్యక్షులు సాయిబాబు, టీడీపీ నాయకులు పోపూరి హనుమంతరావు, దేవరపు చౌదరి అత్తోట రామారావు, అత్తోట శ్రీనివాసరావు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి

డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి




ఇర్లపాడులో సీసీరోడ్ల కొలతలు, మినీగోకులం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, సిబ్బంది

ఇర్లపాడు (శావల్యాపురం) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ నిధులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం గ్రామీణప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. పల్లె పండగ కార్యక్రమం ద్వారా మండలంలోని ఇర్లపాడులో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు, మినీగోకులం షెడ్డు నిర్మాణాలను బుధవారం డ్వామా పీడీ ఆకస్మికంగా తనిఖీచేశారు. నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం పక్కనున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అమలుతీరును, రికార్డులు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను తనిఖీ చేశారు. డ్వామా పీడీ మాట్లాడుతూ పల్లె పండగ ద్వారా గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మినీగోకులాలు, పాఠశాల ప్రహరీల నిర్మాణాలు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. సర్పంచ్ వెనిగండ్ల రమాదేవి, ఏపీడీ బూసిరెడ్డి, ఏపీవో రామారావు, ఏఈ వెంకటేశ్వరస్వామి, జేఈ సుధాకర్, టీఏ బేబీరోజ, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సిమ్మింగ్ టోర్నమెంట్

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ టోర్నమెంట్ బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్‌కుమార్, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నరసరావుపేట ఆధ్వర్యంలో బుధవారం విజిలెన్స్ అవేర్నేస్ ప్రోగ్రామ్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ప్రతి సంవత్సరం జాగరూకత అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 16 నుంచి నవంబరు 15 వరకు జరపాలని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ వీ శ్రీనివాస్, విజిలెన్స్ ఆఫీసర్ రాంబాబు, విజయ్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో డిబేట్, వ్యాసరచన పోటీలలో విజేతకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య, చైతన్య గోదావరి బ్యాంకు సిబ్బంది, అధ్యాపకలు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎం అండ్ హెచ్‌వోకు 104 సిబ్బంది వినతి పత్రం

నరసరావుపేట లీగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 104 ఎంఎంయూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సిబ్బంది జిల్లా వైద్య అధికారి డాక్టర్ రవికుమార్‌కు, నోడల్ అధికారి హనుమకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం రూ.50వేల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంఏఎం గ్రూప్ కళాశాలలో సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలో ఎంఏఎం గ్రూప్ కళాశాలలో బుధవారం యంగ్ మైండ్స్-డ్రీమ్ ఇట్-డూ ఇట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నల్లిబోయిన కాళహస్తి విద్యార్థులకు యంగ్ మైండ్స్-డ్రీమ్ ఇట్-డూ ఇన్, కెరీర్ కౌన్సెలింగ్, జీవిత రహస్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జగ్గారావు

ఈపూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. మండలంలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గోపువారిపాలెం సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు రూ.1 లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈసందర్భంగా శ్రీనివాసరావును మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. జగ్గారావు మాట్లాడుతూ వంద రూపాయలు చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, ఐనాల కోటేశ్వరరావు, బెల్లంకొండ సైదులు, గోపు వీరాంజినేయులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బందెల కన్నయ్య, కాటం కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో రైళ్ళకు స్టాపింగ్ ఇవ్వాలి: హనుమంతరావు

శావల్యాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం రైల్వేస్టేషన్‌లో నాలుగేళ్ళుగా రైళ్లకు స్టాపింగ్ ఇవ్వకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ రాష్ట్ర మాజీ పరిశీలకులు, మతుకుమల్లి మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకి మెయిల్ ద్వారా బుధవారం వినతిపత్రాన్ని పంపారు. హనుమంతరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి రైళ్ళకు స్టాపింగ్ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని ఎంపీని కోరానన్నారు. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించేలా ఎంపీ తక్షణమే స్పందించి సమస్యను ప్రభుత్వం, రైల్వేశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి ప్రయాణికులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

కాలిగ్రఫీ శిక్షకుడు జున్నుసాహెబ్‌కు గౌరవ డాక్టరేట్



జీహెచ్‌ఆర్‌టీ సభ్యుల నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న ఉపాధ్యాయుడు జున్నుసాహెబ్

యడ్లపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, కాలిగ్రఫీ శిక్షకుడు షేక్ జున్నుసాహెబ్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే చేతిరాత (కాలిగ్రఫీ)లో శిక్షణ ఇచ్చినందుకుగాను గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ వారు ఈ గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఇప్పటివరకు జున్నుసాహెబ్ 18వేలమంది విద్యార్థులకు, 750మంది ఉపాధ్యాయులకు కాలిగ్రఫీలో (అందంగా రాయడం)లో శిక్షణ ఇచ్చారు. హైదరాబాద్‌లోని సారస్వత పరిషత్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీలంక విదేశీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి అహ్మాద్‌సాధిక్, శ్రీలంక ఆర్థిక, మౌళిక సదుపాయాల మంత్రిత్వశాఖ కార్యనిర్వాహక సభ్యుడు ముక్తి మోయిన్‌ల నుంచి జున్నుసాహెబ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆయనతోపాటు వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన మరో 50 మందికి ట్రస్టు నిర్వాహకులు డాక్టరేట్‌లను ప్రదానం చేశారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

● ఏవో శివలలిత



ఏవో శివ లలిత

రొంపిచర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారిణి శివలలిత తెలిపారు. ఆమె బుధవారం ఆంధ్రజ్యోతికి వివరాలు...



ప్రశ్న: మండలంలో ఏఏ పంటలను రైతులు సాగు చేశారు?

జవాబు: ఖరీఫ్ సీజన్‌కు వరి పది వేల ఎకరాలు, మొక్క జొన్న వంద ఎకరాలు, కంది రెండు వందల ఎకరాలు, మిరప ఐదు వందల ఎకరాలు, సుబాబులు 1100 ఎకరాలు సాగు చేశారు.

ప్ర: ఎరువులు ఏమేమి అందుబాటులో ఉన్నాయి?

జ: 20-20-013, 14-35-14, యూరియా, పొటాష్, డీఏపీలు అందుబాటులో ఉన్నాయి.

ప్ర: ప్రస్తుతం ఏ పంటకు ఎరువులు రావాల్సి ఉంది.

జ: పొటాష్ మొక్కజొన్న పంటకు అవసరం ఉంది. ఈ ఎరువులు మండలానికి కేటాయించారు. జీడీసీఎంఎస్ ద్వారా రొంపిచర్లలో అందజేయనున్నారు.

ప్ర: పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎక్కడెక్కడ జరగాల్సి ఉంది?

జ: సుబ్బయ్యపాలెం, తురుమెళ్ళ గ్రామాల్లో ఈ కార్యక్రమం జరగాల్సి ఉంది.

ప్ర: విత్తనాల శనగలు అందుబాటులో ఉన్నాయా?

జ: రొంపిచర్ల, అవాల, గోగులపాడు, గ్రామాలకు సంబంధించి 75 క్వింటాళ్ళు తెల్ల శనగలు అందుబాటులో ఉన్నాయి.




కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు తదితరులు

ఘనంగా కొమ్మాలపాటి జన్మదినం

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కేక్ కట్ చేసి కొమ్మాలపాటి శ్రీధర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొని కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వేములపల్లి వెంకటనరసయ్య, రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, కార్యనిర్వాహక కార్యదర్శి కోసూరి వీరరాఘవులు, పులిమి వెంకట రామిరెడ్డి, వాసిరెడ్డి రవీంద్ర, జాస్తి చంద్రశేఖర్, బండారుపల్లి విశ్వేశ్వరరావు, కోట నాగసుధీర్, కూరపాటి శ్రీను, అబ్బూరి శ్రీనివాసరావు, ఉడత రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు బాలోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

శావల్యాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నర్సరావుపేటలోని పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో డిసెంబరు 13, 14తేదీలలో జిల్లాస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు జరుగుతాయని పల్నాడు జిల్లా బాలోత్సవం వినుకొండ నియోజకవర్గ కన్వీనర్ బీవీ నాగేశ్వరరావు వెల్లడించారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో పల్నాడు బాలోత్సవం వేడుకల వాల్‌పోస్టర్లను ఆయన ఉపాధ్యాయులతో కలసి బుధవారం ఆవిష్కరించారు. కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూసృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందింపజేసేందుకు, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు 64రకాల సాంస్కృతిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పల్నాడు బాలోత్సవం నిర్వాహక కమిటీ మెంబర్ వెంకట్, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు రవి, అబ్దుల్లా, వసంత్, నిర్మలకుమారి పాల్గొన్నారు.